# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 31-12-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 107 పేజీలు:6 వెల: రూ.1/-


## డిసెంబర్ 31న.. హైదరాబాద్ లో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్, డిసెంబర్ 30హైదరాబాద్ లో డిసెంబరు 31వ తేదీ రాత్రి 10గంటల నుంచి 2గంటలవరకు ఆంక్షలు అమల్లో ఉంటాయి.

అటు, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోనూ ఆంక్షలు విధించారు. ఖైరతాబాద్ మీదుగా నెక్లెర్ రోడ్, ఎన్టీఆర్ మార్గ్ దిశగా వెళ్లే వాహనాలను నిరంకారి భవన్, రాజ్ భవన్ రోడ్డు మీదుగా మళ్లిస్తారు. ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్, అప్పర్ ట్యాంక్ బండ్ మీదుగా వెళ్లేందుకు అనుమతించరు.ఆంక్షల సమయంలో మింట్ కాంపౌండ్ రోడ్డును మూసివేస్తారు. లిబర్టీ జంక్షన్, అప్పర్ ట్యాంక్ బండ్ మీదుగా వెళ్లే వాహనాలను అంబేద్కర్ విగ్రహం నుంచి దారి మళ్లించనున్నారు. సికింద్రాబాద్ నుంచి ట్యాంక్ బండ్ దిశగా వెళ్లే వాహనాలను కవాడిగూడ జంక్షన్, లోయర్ ట్యాంక్ బండ్ కట్టమైసమ్మ ఆలయం మీదుగా దారి మళ్లిస్తారు. ట్రాఫిక్ ఉల్లంఘలనపై డిసెంబరు 31న నగరంలో స్పెషల్ డ్రైవ్ చేపడతామని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు.

## ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మాతృవియోగం

న్యూఢిల్లీ డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మాతృవియోగం కలిగింది. మోదీ మాతృమూర్తి హీరాబెన్ మోదీ శుక్రవారం తెల్లవారుజామున 3.39 గంటలకు కన్నుమూశారు. ఇటీవలే వందో పుట్టినరోజు పూర్తిచేసుకున్న ఆమె.. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో అహ్మదాబాద్‌లోని యూఎన్ మెహతా దవాఖానలో చికిత్స పొందుతున్నారు. అయితే ఆమె ఆరోగ్యం విషమించడంతో ఇవాళ ఉదయం తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న ప్రధాని మోదీ.. హుటాహుటిన ఢిల్లీ నుంచి గుజరాత్ చేరుకున్నారు.తల్లి మరణంపై ప్రధాని మోదీ భావోద్వేగంతో ట్వీట్ చేశారు. 'నిండు నూరేండ్లు పూర్తిచేసుకుని ఈశ్వరుని చెంతకు చేరింది. ఆమె జీవిత ప్రయాణం ఒక తపస్సు లాంటిది' అని ట్విట్టర్‌లో పోస్టు చేశారు. కాగా, హీరాబెన్ రెండు రోజుల క్రితం స్వల్ప అస్వస్థతకు లోనైన విషయం తెలిసిందే. దీంతో యూఎన్ మెహతా దవాఖానకు ఆమెను తరలించారు. ప్రధాని మోదీ గంటన్నరకు పైగా దవాఖానలోనే గడిపారు. తల్లి ఆరోగ్యం గురించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అయితే ఆరోగ్యం నిలకడగానే ఉందని హాస్పిటల్ వర్గాలు హెల్త్ బులెటిన్ విడుదల చేసిన కొన్ని గంటల్లోనే హీరాబెన్ ఈ లోకాన్ని విడిచివెళ్లారు.

## ప్రధాని మోదీ తల్లి హీరాబెన్ మృతిపట్ల సీఎం కేసీఆర్ సంతాపం

హైదరాబాద్ డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తల్లి హీరాబెన్ మృతిపట్ల సీఎం కేసీఆర్ సంతాపం తెలిపారు. ప్రధానికి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు.ప్రధాని మోదీ మాతృమూర్తి హీరాబెన్ మోదీ శుక్రవారం తెల్లవారుజామున 3.39 గంటలకు కన్నుమూశారు. ఇటీవలే వందో పుట్టినరోజు పూర్తిచేసుకున్న ఆమె.. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో అహ్మదాబాద్‌లోని యూఎన్ మెహతా దవాఖానలో చికిత్స పొందుతున్నారు. అయితే ఆమె ఆరోగ్యం విషమించడంతో ఇవాళ ఉదయం తుదిశ్వాస విడిచారు.హీరాబెన్ మృతిపట్ల మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇంద్రకరణ్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్ సంతాపం తెలిపారు.

## దేశంలో 243 కరోనా కొత్త కేసులు నమోదు

న్యూ డిల్లీ డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);దేశంలో గత 24 గంటల్లో 243 కరోనా కొత్త కేసులు వెలుగు చూశాయి. గురువారం ఉదయం 8గంటల నుంచి శుక్రవారం ఉదయం 8గంటల వరకు 2,13,080 మందికి వైరస్ నిర్ధారణ పరీక్షలు చేయగా 243 కొత్త కేసులు బయటపడినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది. తాజా కేసులతో మొత్తం వైరస్ బాధితుల సంఖ్య 4,46,78,158కి చేరింది. ప్రస్తుతం దేశంలో 3,609 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఇక 24 గంటల్లో ఒకరు మృతి చెందగా.. మొత్తం మరణాల సంఖ్య 5,30,699కి చేరింది.ఇప్పటివరకు నమోదైన మొత్తం పాజిటివ్ కేసుల్లో 0.01 కేసులు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నాయని వెల్లడించింది. రికవరీ రేటు 98.80 శాతంగా, మరణాలు 1.19 శాతంగా ఉన్నాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 220.09 కోట్ల కరోనా వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేశామని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది.

## జనవరి 1నుండి ఫిబ్రవరి15 వరకు నుమాయిష్ ఎగ్జిబిషన్.. టిక్కెట్ ధర రూ.40

హైదరాబాద్, డిసెంబర్ 30నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో ప్రతి ఏటా నిర్వహించే పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన నుమాయిష్ జనవరి 1నుండి ప్రారంభం కానుంది. కాగా ఈ ఎగ్జిబిషన్ ఫిబ్రవరి 15 వరకు జరగనుంది. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్ ఉంటుంది. ఈ 82వ ఆలిండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ లో 2,400 స్టాళ్లు ఏర్పాటు చేశారు. వీటిలో విదేశీ సంస్థలకు చెందిన స్టాళ్లు కూడా ఉన్నాయి. నుమాయిష్‌లో ఈసారి టికెట్ ధర పెంచారు. గతంలో రూ.30 ఉన్న టికెట్ ధరను ఇప్పుడు రూ.40కి పెంచారు. ఐదేళ్ల లోపు వయసున్న చిన్నారులకు ప్రవేశం ఉచితం అని నిర్వాహకులు తెలిపారు. ఎగ్జిబిషన్ కు వచ్చే వారి వాహనాలకు ఉచిత పార్కింగ్ సదుపాయం కల్పిస్తున్నారు.

స్థానికంగా తయారయ్యే ఉత్పత్తులకు ప్రచారం, ప్రోత్సాహం అందించాలన్న ఉద్దేశంతో 1938లో 'నుమాయిష్' ప్రారంభమైంది. అప్పటి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఈ పారిశ్రామిక ఎగ్జిబిషన్ ను ప్రారంభించారు. మొదట్లో 50 స్టాళ్లతో ప్రారంభమైన 'నుమాయిష్' ఇప్పుడు 2 వేలకు పైగా స్టాళ్లతో దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రదర్శనగా గుర్తింపు తెచ్చుకుంది. హైదరాబాదులో నిర్వహించే 'నుమాయిష్' ను నిత్యం 45 వేలమంది సందర్శిస్తారని అంచనా. 2019లో నిర్వహించిన 'నుమాయిష్' లో భారీ అగ్నిప్రమాదం జరిగి వందలాది స్టాళ్లు కాలిబూడిదయ్యాయి. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈసారి ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. స్టాళ్ల నిర్వాహకులు ఎక్కడా వంటలు చేయకుండా నిషేధించారు. రెండు ఫైరింజన్లను అందుబాటులో ఉంచనున్నారు. విద్యుత్ వైర్లు, గ్యాస్ పైపుల విషయంలో అత్యంత భద్రమైన ఏర్పాట్లు చేసుకోవాలని స్టాళ్ల నిర్వాహకులకు అగ్నిమాపక శాఖ స్పష్టం చేసింది. ప్రతిస్టాల్ లోనూ ఫైర్ ఎక్స్ టింగ్విషర్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపింది.

### చరిత్రలో నేటినిజం





(డిసెంబర్ 31 బీహార్ మాజీ ముఖ్యమంత్రి కే.బీ. సహాయిన్ జయంతి..)



-రాధశ్రీ

సెల్:9494481210

## క్యాసినో నిర్వహిస్తున్న హోటల్ లో అగ్నిప్రమాదం..

### 19మంది మృతి.. మృతుల సంఖ్య పెరిగే ఛాన్స్



న్యూఢిల్లీ, డిసెంబర్ 30క్యాసినో నిర్వహిస్తున్న హోటల్ లో అగ్నిప్రమాదం జరిగింది.ఈ ఘటనలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని కాంబోడియా అధికారులు వెల్లడించారు. కాంబోడియా-థాయిలాండ్ సరిహద్దులోగల పోయిపేట్‌లోని గ్రాండ్ డైమండ్ సిటీ హోటల్ క్యాసినోలో జరిగిన అగ్నిప్రమాదంలో మృతుల సంఖ్య అంతకంతకే పెరుగుతుంది. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు మరణించిన వారి సంఖ్య 19కి చేరింది. దాదాపు 120 మందికి పైగా ఈ ప్రమాదంలో గాయపడి వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వాళ్లలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది.

క్యాసినో నిర్వహిస్తున్న ఆ హోటల్‌లో ప్రమాదం జరిగిన సమయంలో దాదాపు 1000 మందికి పైగా ఉన్నట్లు అక్కడి అధికార యంత్రాంగం ప్రకటించింది. మంటలను ఆర్పడానికి 11 ఫైరింజన్‌లను వినియోగించారు. ప్రమాదం నుంచి మొత్తం 700 మందిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రమాదం సమయంలో పరిసర ప్రాంతాలను దట్టమైన పొగ కమ్మేసిందని, పెద్దఎత్తున మంటలు ఎగిసిపడటంతో హోటల్‌లో చిక్కుకున్న వారు ప్రాణభయంతో ఆర్తనాదాలు చేశారని, కొందరు ప్రాణాలను కాపాడుకోవడానికి హోటల్ నుంచి బయటికి దూకి తీవ్ర గాయాలపాలయ్యారని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం థాయ్‌లోని వివిధ ఆస్పత్రుల్లో 79 మంది థాయ్ దేశీయులు, 30 మంది కాంబోడియన్లు, 8 మంది ఇండోనేషియన్లు చికిత్స పొందుతున్నట్లు థాయ్ విదేశాంగ శాఖ వెల్లడించింది.

## యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



యాదాద్రి భువనగిరి 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దర్శించుకున్నారు. యాదాద్రీశుడికి ప్రత్యేక పూజలు చేశారు. యాదగిరిగుట్ట పర్యటనలో భాగంగా శుక్రవారం ఉదయం యాదాద్రికి చేరుకున్న రాష్ట్రపతికి మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్ పుష్పగుచ్ఛాలతో ఆహ్వానం పలికారు. ఆలయం వద్ద అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభువు లక్ష్మీ నరసింహస్వామివారిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దర్శించుకున్నారు. దర్శనానంతరం రాష్ట్రపతికి ఆలయ ప్రధాన అర్చకులు వేదాశీర్వచనం అందించగా, మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను అందజేశారు.తర్వాత యాదాద్రి ప్రధాన ఆలయ పరిసరాలను రాష్ట్రపతి పరిశీలించారు. అద్దాల మండపం, ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. రాష్ట్రపతి వెంట గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఉన్నారు. కాగా, యాదగిరిగుట్టను సందర్శించిన ఐదో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కావడం గమనార్హం.

## ముగిసిన ప్రధాని నరేంద్ర మోదీ తల్లి హీరాబెన్ అంత్యక్రియలు



అహ్మదాబాద్ డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ప్రధాని నరేంద్ర మోదీ తల్లి హీరాబెన్ అంత్యక్రియలు పూర్తయ్యాయి. మాతృమూర్తి చితికి మోదీ నిప్పంటించారు. చివరిసారిగా చేతులు జోడించి అంతిమ నివాళులర్పించారు. సోదరుడు, కుటుంబ సభ్యులతో కలిసి తన తల్లికి వీడ్కోలు పలికారు. అంతిమ యాత్రలో భాగంగా ప్రధాని మోదీ తన మాతృమూర్తి పాడె మోశారు. వాహనంలో అమ్మ పక్కనే కూర్చున్నారు. గాంధీనగర్‌లోని సెక్టార్ 30 స్మశాన వాటిలో జరిగిన అంతిమక్రియల్లో మోదీ కుటుంబ సభ్యులతోపాటు గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.ప్రధాని మోదీ తల్లి హీరాబెన్ పటేల్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో అహ్మదాబాద్‌లోని యూఎన్ మెహతా దవాఖానలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచిచారు. ఇటీవలే వందో పుట్టిన రోజు జరుపుకున్న విషయం తెలిసిందే.

## స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి : ఎమ్మెల్యే అరూరి రమేశ్

వరంగల్, డిసెంబర్ 30మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ కోరారు. అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్వతగిరి, వర్ధన్నపేట మండలాలకు చెందిన మహిళలు ఉచిత బ్యూటిషియన్ శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా సర్టిఫికెట్లు అందజేశారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మహిళా ఆర్థిక స్వేచ్ఛ కలిగి ఉండాలని అందుకోసం మహిళలు స్వయం ఉపాధి మార్గాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంత యువతులకు, మహిళలకు స్వయం ఉపాధిలో ప్రోత్సాహం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. తక్కువ కాల వ్యవధిలో స్వయం ఉపాధి చేపట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి బ్యూటిషియన్ కోర్సు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

బ్యూటిషియన్ శిక్షణ తీసుకున్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని మరో నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ ద్వారా వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోనే కాకుండా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అనేక మంది విద్యార్థులు, నిరుద్యోగులు, క్రీడాకారులు, నిరుపేదలకు ఆర్థిక సహాయం అందిస్తుందని అన్నారు.



## యునిసెఫ్ గుర్తింపు.. తెలంగాణకే గర్వకారణం : మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబర్ 30 మాతా శిశువుల సంరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రపంచ సంస్థలు గుర్తించడం తెలంగాణకే గర్వకారణంగా ఉందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ట్వీట్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఆరోగ్య తెలంగాణ అభివృద్ధి చెందుతుంది. అందుకు ఇది ఒక నిదర్శనమని హరీశ్‌రావు పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వంపై యునిసెఫ్ ఇండియా ప్రశంసలు కురిపించింది. మాతా శిశువుల సంరక్షణ కోసం తెలంగాణ సర్కార్ చేస్తున్న కృషి అద్భుతమని కొనియాడింది. సురక్షిత డెలివరీల కోసం సిబ్బందికి మిడ్ వైఫరీ కోర్సులో శిక్షణ ఇస్తున్న తీరును యునిసెఫ్ ఇండియా మెచ్చుకున్నది. ఈ నేపథ్యంలో యునిసెఫ్ ఇండియా తన ట్విట్టర్‌లో ఇవాళ ఓ పోస్టు చేసింది. హైదరాబాద్‌లోని ఓ ఏరియా ఆస్పత్రిలో మిడ్ వైవ్స్ ద్వారా పురుడు పోసుకున్న ఓ శిశువు ఫోటోను యునిసెఫ్ ఇండియా తన ట్విట్టర్ పోస్టులో జత చేసింది.

తెలంగాణలో మాతాశిశు సంరక్షణ భేష్‌గా ఉందని యునిసెఫ్ పేర్కొన్నది. మిడ్ వైఫరీలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే దిక్సూచిగా నిలిచినట్లు యునిసెఫ్ తన ట్వీట్‌లో వెల్లడించింది. మెటర్నిటీ కేర్ అంశంలో తెలంగాణ సర్కార్ గౌరవప్రదమైన రీతిలో పనిచేస్తున్నట్లు యునిసెఫ్ పేర్కొన్నది. పురుడు సమయంలో తల్లులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, పాజిటివ్ బర్త్ ఎక్స్‌పీరియన్స్ కలిగే రీతిలో మిడ్‌వైవ్స్‌కు శిక్షణ ఇస్తున్న తీరును యునిసెఫ్ ప్రశ్నించింది. ఫర్ ఎవర్నీ చైల్డ్, ఎ హెల్తీ స్టార్ట్ అన్న హ్యాష్‌ట్యాగ్‌ను యునిసెఫ్ పోస్టు చేసింది.

## డీజీపీ మహేందర్ రెడ్డి సేవలు ప్రశంసనీయం : హోంశాఖ మంత్రి



హైదరాబాద్, డిసెంబర్ 30రాష్ట్రానికి డీజీపీ మహేందర్‌రెడ్డి అందించిన సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమ్మద్ మహమూద్ అలీ అన్నారు. మహేందర్‌రెడ్డి రేపు (శనివారం ) పదవి విరమణ చేస్తున్న సందర్భంగా మంత్రి శుక్రవారం హైదరాబాద్ లకిడికాపూల్‌లోని తన కార్యాలయంలో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం నుంచి వివిధ హోదాల్లో మహేందర్ రెడ్డి చక్కటి సేవలందించారని కొనియాడారు. దేశంలోనే రాష్ట్ర పోలీసు శాఖను అగ్రస్థానంలో నిలబెట్టారని ప్రశంసించారు. విధి నిర్వహణలో తనదైన ముద్ర వేశారని తెలిపారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ గా, రాష్ట్ర డీజీపీగా, దాదాపు 34 సంవత్సరాల పాటు పోలీసు అధికారిగా అందరి మన్ననలు పొందారని పేర్కొన్నారు.

డీజీపీగా తెలంగాణ పోలీసు శాఖను అగ్రభాగాన నిలిపారని వెల్లడించారు. ఇంకా ఈ కార్యక్రమంలో హోం శాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్తా, అడిషనల్ డీజీపీలు జితేందర్, సంజయ్ కుమార్ జైన్ పాల్గొన్నారు.

## 5,204 స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, డిసెంబర్ 30 తెలంగాణలో కొలువుల జాతర కొనసాగుతూనే ఉంది. న్యూఇయర్ వేళ నర్సింగ్ విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త వినిపించింది. 5,204 స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు జనవరి 25 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. డీఎంఈ, డీహెచ్ పరిధిలో 3,823 పోస్టులను భర్తీ చేయనున్నారు. వైద్య విధాన పరిషత్‌లో 757 పోస్టులను భర్తీ చేయనున్నారు.

## కరోనాతో ముప్పు లేదు.. న్యూ ఇయర్.. సంక్రాంతి వేడుకలపై ఆంక్షలు లేవ్.. డీహెచ్ శ్రీనివాసరావు

హైదరాబాద్, డిసెంబర్ 30ఇండియాలో పలు రాష్ట్రాల్లో బీఎఫ్-7 కేసులు నమోదవుతోన్నాయి. దీంతో కేంద్ర ప్రభుత్వ అప్రమత్తమైంది. జాగ్రత్తగా ఉండాల్సిందగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించింది. కేంద్ర హెచ్చరికల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వ అప్రమత్తమైంది. కరోనా టెస్టు శాంపిల్స్‌ను జీనోమ్ సీక్వెన్సింగ్‌కు పంపాలని నిర్ణయం తీసుకుంది. ఓమిక్రాన్ వ్యాప్తి నేపథ్యంలో తెలంగాణలో న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు విధిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంపై తెలంగాణ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు క్లారిటీ ఇచ్చారు. న్యూ ఇయర్, సంక్రాంతి వేడుకలకు ఎలాంటి కరోనా ఆంక్షలు విధించడం లేదని స్పష్టం చేశారు. కరోనా పట్ల ఇండియాలో ఎలాంటి సమస్య లేదని, వేడుకలు జరుపుకోడానికి భయపడాల్సిన అవసరం లేదని తెలిపారు.

చైనాలో విజృంభిస్తున్న ఓమిక్రాన్ సబ్ వేరియంట్లను గతంలోనే మనం ఎదుర్కొన్నామని, ఎలాంటి టెన్షన్ పడాల్సిన అవసరం లేదని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని శ్రీనివాసరావు సూచించారు. కరోనా వల్ల ఇప్పుడు వచ్చిన ముప్పేమీ లేదన్నారు. న్యూ ఇయర్, సంక్రాంతి వేడుకలపై ఎలాంటి ఆంక్షలకు సంబంధించి ఎలాంటి ఆంక్షలు ఉండవని, ప్రభుత్వానికి కూడా తాము ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదని తెలిపారు. న్యూ ఇయర్ వేడుకలపై కరోనా ఆంక్షలు విధించనున్నామని వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. ప్రజలు యాథావిధిగా వేడుకలు జరుపుకోవచ్చని శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## గ్రూప్-3 నోటిఫికేషన్ విడుదల.. 1365 పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్

హైదరాబాద్ డిసంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: తెలంగాణ రాష్ట్రంలో కొలువుల జాతర కొనసాగుతూనే ఉంది. నిన్న గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల కాగా, తాజాగా గ్రూప్-3 నోటిఫికేషన్ విడుదలైంది. 1365 పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు జనవరి 24 నుంచి ఫిబ్రవరి 23వ తేదీ మధ్యలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. 768 గ్రూప్-2 పోస్టులకు నిన్న నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. తదితర వివరాల కోసం లిలిలి.బిబజూబఇ.ఇనీల.తిని అనే వెబ్‌సైట్‌ను సందర్శించొచ్చు.ఇప్పటికే గ్రూప్-1, గ్రూప్-4 నోటిఫికేషన్లు విడుదలైన సంగతి తెలిసిందే. గ్రూప్-1 ప్రిలిమినరీ ఫలితాలు కూడా త్వరలోనే విడుదల కానున్నాయి. ఇక గ్రూప్-4 నోటిఫికేషన్‌కు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ నేటి నుంచి ప్రారంభమైంది. హాస్టల్ వార్డెన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయింది. హార్టికల్చర్, వెటర్నరీ శాఖల్లో కూడా కొలువుల భర్తీకి ప్రకటనలు వెలువడ్డాయి. మరోవైపు పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు పోలీసు కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాల భర్తీకి ప్రక్రియ కొనసాగిస్తోంది. పోలీసు ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా ఫిజికల్ ఈవెంట్స్ కొనసాగుతున్నాయి. మొత్తంగా తెలంగాణలో కొలువుల జాతర కొనసాగుతోంది.

# కుటుంబాభివృద్ధే ప్రపంచాభివృద్ధికి మూలం

## (01 జనవరి 'గ్లోబల్ ఫ్యామిలీ డే' సందర్భంగా)

ప్రపంచ సమాజంలో కుటుంబం ఒక యూనిట్‌గా గుర్తించబడుతున్నది. కుటుంబం లేని వ్యక్తులు ఉండరు. కుటుంబ వాతావరణమే బాలల ఎదుగుదలకు దోహదపడుతుంది. కుటుంబ సభ్యుల మధ్య 'షేరింగ్ అండ్ కేరింగ్' భావనలు కలిగితేనే అనుబంధాల పువ్వులు వికసిస్తాయి, విచారాలు తొలగి పోయి ఆనంద పరిమళ జల్లులు వెదజల్లబడతాయి. ఉమ్మడి కుటుంబాలు, న్యూక్లియర్ కుటుంబాలు, స్వలింగ భాగస్వామ్య కుటుంబాలు లాంటి పలు రకాల కుటుంబాలు నేటి డిజిటల్ యుగంలో కనిపిస్తున్నాయి. కుటుంబం రక్తసంబంధాల సమ్మేళనం, ప్రేమానుబంధాల కోవెల, పిల్లలకు స్వర్గధామం, స్వేచ్ఛకు తావు, బాధలకు లేపనం, సంతోషాల నెలవు, అనువంశికతకు ఆదరువు, చిరునవ్వుల గుడి, ఆది గురువులు కొలువైన తావు. కుటుంబాలు విచ్ఛిన్నమైన సమాజంలో అశాంతి మంటలు చెలరేగుతాయి. కుటుంబ అభివృద్ధితోనే ప్రపంచాభివృద్ధి సుసాధ్యం అవుతుంది. విశ్వవ్యాప్తంగా విస్తరించి ఉన్న మానవ సమాజంలో కుటుంబాలే ముఖ్య యూనిట్లుగా పరిగణించ బడుతున్నాయి. కుటుంబాల్లో పరస్పర సహకారం, పంచుకోవడం, సంరక్షణ, ప్రేమ, బేషరతు సహకార ధోరిణి, నమ్మకాల నిధి, విధేయత, మానవీయ విలువలు, ఆప్యాయతలు, సానుకూల దృక్పథం, త్యాగాలు, అనుబంధాలతో వర్థిల్లినంత కాలం సమాజంలో శాంతి సామరస్యాలు విస్తరించడం జరిగి సుఖసంతోషాల కోవెలలుగా నిలబడాయి.

### ప్రపంచంలో 2.3 బిలియన్ల కుటుంబాలు:

నేడు ప్రపంచ జనాభా 140 కోట్లు దాటి 2023లో అత్యధిక జనాభా కలిగిన దేశంగా చైనాను దాటి భారతం తొలి స్థానాన్ని పొందనుంది. ప్రపంచంలో 2.3 బిలియన్ల గృహాలు/కుటుంబాలు ఉన్నాయని తెలుస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా 4200లకు పైగా మతాలు, విశ్వాసాలు, సంస్కృతులు ఉన్నాయి. ఇండియాలోనే 3,000ల కులాలు, 25,000ల ఉపకులాల కుటుంబాలు ఉన్నాయి. ప్రపంచంలోనే అతి పురాతన భాషగా సంస్కృతం గుర్తించబడి, విశ్వవ్యాప్తంగా 7,151 భాషలు మాట్లాడే ప్రజలు ఉన్నట్లు, అందులో ఆంగ్లం మాట్లాడే జనులు అత్యధికంగా ఉన్నట్లు తేలింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 2.3 బిలియన్ల గృహాల్లో నివసిస్తున్న మానవాళి తమ తమ పరిధిలో సుఖ సంతోషాలతో ఉన్నపుడు ప్రపంచమే ఓ కుగ్రామమై, కంచెలు/దూరాలు చెరిగి పోయి సామరస్య సహజీవన భావన పెరుగుతుందని గమనించాలి.

### ప్రపంచ శాంతి మంత్రం:

క్రీస్తుశకం 117-138 రోమన్ కాలంలో హాడ్రిన్ ప్రవేశ పెట్టిన 'శాంతి (పీస్)' అనబడే భావనకు 3వ శతాబ్దంలో బహుళ ప్రచారం జరిగింది. 1945లో 2వ ప్రపంచ యుద్ధం నేర్పిన గుణపాఠాలతో ప్రపంచ శాంతి స్థాపనకు వేదికగా ప్రపంచ దేశాలు 'ఐక్యరాజ్యసమితి (ఐరాస)'ని ప్రారంభించారు. 1960ల్లో 'జోహన్ గాల్టుంగ్' ప్రవేశపెట్టిన 'పాజిటివ్ పీస్' భావనతో పాటు 1996లోఅమెరికన్ మేధావి 'లిండా గ్రోవర్' రచించిన బాలల పుస్తకం 'వన్ డే ఇన్ పీస్- జనవరి 01న (ఒక రోజు శాంతిగా- జనవరి 01, 2000)' ఆధారంగా ప్రతి ఏట 'గ్లోబల్ ఫ్యామిలీ డే' లేదా 'వరల్డ్ పీస్ డే' పాటిస్తున్నారు. 1997లో ఐరాస 'అంతర్జాతీయ ప్రపంచ బాలల సాంస్కృతిక శాంతి, అహింస దశాబ్దం' పాటించాలనే ఆలోచనలు చేసింది. దీనిలో భాగంగా 1999లో ఐరాస తీసుకున్న తీర్మానం ప్రకారం 01 జనవరి 2001ల నుండి ప్రతి ఏట 'గ్లోబల్ ఫ్యామిలీ డే' పాటించుట ఆనవాయితీగా మారింది. ప్రపంచ మానవాళి మధ్య సామరస్యం, శాంతియుత సహజీవనం, ఏకత్వ సాధనకు కుటుంబ సభ్యుల శారీరక మానసిక ఆరోగ్యాలు దోహదపడతాయి.

### గ్లోబల్ విలేజ్ భావన:

కుటుంబాల సంక్షేమంతో వసుదైక కుటుంబం (గ్లోబల్ విలేజ్) సుసాధ్యం అవుతుంది. ప్రపంచవ్యాప్త సమాజంలోని కుటుంబాల ఆలోచనలు కలిసినపుడు కుటుంబాభివృద్ధి మె?దలై సమాజాభివృద్ధి, గ్రామాభివృద్ధి, జిల్లాభివృద్ధి, రాష్ట్రాభివృద్ధి, దేశాభివృద్ధి, ప్రపంచాభివృద్ధి సుసాధ్యం అవుతుందని గమనించాలి. వేగవంతమైన ఆధునిక జీవన విధానంలో కుటుంబ సభ్యులు కలిసి కొంత సమయం గడపడం కష్టంగా తోస్తున్నది. కనీసం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా అయినా కుటుంబాలు కలిసి రోజంతా గడపడం (వన్ డే ఆఫ్ పీస్ అండ్ కేరింగ్), అభివృద్ధి పథకాలు రచించుకోవడం, నూతన తీర్మానాలు చేసుకొని వ్యక్తిగత, కుటుంబ, సమాజాభివృద్ధికి, శాంతి స్థాపనకు కృషి చేయాలి. కొత్త సంవత్సరం, కొత్త ఆశలు, కొత్త తీర్మానాలు, కొత్త లక్ష్యాలు, కొత్త ఆలోచనలు చేస్తూ ప్రతి ఏడాది ప్రగతి పథంలో నడవడానికి స్వచ్ఛందంగా ప్రతినబూనాలి. కుటుంబ సభ్యుల మధ్య జ్ఞాన వినిమయం, ఆలోచనలు పంచుకోవడం, మంచి చెడుల అవగాహన, పరస్పర సహకారం, సమస్యలను కలిసికట్టుగా ఏదుర్కోవడం లాంటివి అలవాటుగా చేసుకోవాలి.

ప్రతి ఒక్కరికీ కుటుంబం ఒక్కటే ఉంటుంది. కుటుంబాన్ని స్వర్గంగా లేదా నరకంగా మార్చుకోవడం మన చేతుల్లోనే ఉందని నమ్మాలి. కుటుంబ సభ్యుల మధ్య అభిప్రాయ భేదాలు తాత్కాలికం, పరిష్కార యోగ్యమని నమ్మాలి. ఒకే జీవితం, ఒకే కుటుంబం, ఒకే అమ్మానాన్న ఉన్న సమాజంలో మనందరం భాగస్వామ్యం కలిగి ఉన్నాం. మన కుటుంబాలను ఆనందమయ స్వర్గధామాలుగా మార్చుకుంటూ, ప్రపంచ శాంతి, సమాజాభివృద్ధికి దోహదపడదాం. వసుదైక కుటుంబ భావనను జీర్ణించుకుందాం.



- డా।। బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# మారుమూల ప్రాంతాలకు మరియు పేదలలోని నిరుపేదలకు చేరాలి దీనిని సామాజిక న్యాయ సాధనంగా ఉపయోగించుకోవాలి

న్యూఢిల్లీ, డిసెంబర్ 30సాంకేతికత ప్రయోజనాలు మారుమూల ప్రాంతాలకు మరియు పేదలలోని నిరుపేదలకు చేరాలి; దీనిని సామాజిక న్యాయ సాధనంగా ఉపయోగించుకోవాలని భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము అన్నారు. శ్రీమతి ద్రౌపది ముర్ము ఈరోజు (డిసెంబర్ 29, 2022) హైదరాబాద్‌లోని జి. నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఫర్ ఉమెన్ విద్యార్థులు మరియు అధ్యాపకులను ఉద్దేశించి, బిఎమ్ మలానీ నర్సింగ్ కళాశాల మరియు మహిళా దక్షతా సమితికి చెందిన సుమన్ జూనియర్ కళాశాల విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

కంప్యూటర్లు, వైద్య పరికరాలు, ఇంటర్నెట్, స్మార్ట్ పరికరాలు డిజిటల్ చెల్లింపు వ్యవస్థలతో సహా సాంకేతిక పురోగతిలో ఇంజనీరింగ్ రంగం పెద్ద పాత్ర పోషించిందని రాష్ట్రపతి అన్నారు. ఊహాతీతమైన మరియు గతంలో లేని సమస్యలకు సత్వర మరియు సుస్థిరమైన పరిష్కారాలు అవసరమయ్యే నేటి ప్రపంచంలో ఒక వృత్తిగా ఇంజనీరింగ్ పాత్ర చాలా క్లిష్టమైనది.

ప్రపంచాన్ని మెరుగైన నివాసయోగ్య ప్రదేశం గా మార్చే శక్తి ఇంజనీర్లకు ఉందని రాష్ట్రపతి అన్నారు. వారు కనుగొనే పరిష్కారాలు మరియు భవిష్యత్తులో వారు రూపొందించే సాంకేతికతలు ప్రజల జీవన నాణ్యత ఆధారితంగా మరియు పర్యావరణ అనుకూలమైనవిగా ఉండాలి.

ఇటీవల కాప్ 27లో, భారతదేశం పుడమిని ఓ సురక్షిత గ్రహంగా ఉంచే తన భవిష్య దృష్టి కోణాన్ని పర్యావరణ హిత జీవన శైలి అనే ఒక పద మంత్రంలో పునరుద్ఘాటించింది. మనం మన వాతావరణ లక్ష్యాలను సాధిస్తున్నాము మరియు వాటిని ఉన్నతీకరణ చేస్తున్నాం. మనం పునరుత్పాదక శక్తి, ఇ-మొబిలిటీ, ఇథనాల్-మిశ్రమ ఇంధనాలు మరియు హరిత హైడ్రోజన్‌లో కొత్త ప్రయత్నాలను చేస్తున్నాము. ఈ కార్యక్రమాలు సాంకేతిక ఆవిష్కరణల ద్వారా పర్యావరణ పరంగా మెరుగైన ఫలితాలను సాధించవచ్చు.

నేటి ప్రపంచంలో సాంకేతికత సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, పర్యావరణ మరియు భౌగోళిక రాజకీయ కోణాలను కలిగి ఉందని రాష్ట్రపతి అన్నారు. ఇది నిరంతరం అభివృద్ధి చెందుతోంది మరియు ప్రతి రంగాన్ని ప్రభావితం చేస్తుంది. ఇంజనీర్లు వినూత్న సాంకేతికతలతో ప్రజల ప్రయోజనాల కోసం ముందుకు వస్తారని మరియు ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరుస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. వెనుకబడిన వర్గాలు, వృద్ధులు, దివ్యాంగులు మరియు ప్రత్యేక మద్దతు అవసరమయ్యే ఇతర వ్యక్తుల కోసం ఇంజనీరింగ్ పరిష్కారాల గురించి కూడా ఆలోచించాలని ఆమె అన్నారు.

ఇంజినీరింగ్ మరియు టెక్నాలజీలో మహిళల పాత్ర గురించి రాష్ట్రపతి ప్రస్తావిస్తూ, పెద్ద కంపెనీలకు నాయకత్వం వహిస్తున్న, స్టార్టప్‌లను ప్రారంభించి, టెలికాం, ఐటీ, ఏవియేషన్ యంత్రాల రూపకల్పన, నిర్మాణ పనులు, కృత్రిమ మేధస్సు వంటి అన్ని రంగాలలో ప్రధానమైన నాయకత్వ స్థానాలను అధిరోహించి సహకరిస్తున్న ఎందరో స్ఫూర్తిదాయకమైన మహిళల ఉదాహరణలు మనకు ఉన్నాయని అన్నారు. సైన్స్ శాఖలను చేపట్టేందుకు మరింత మంది మహిళలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఆమె ఉద్ఘాటించారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ మరియు గణితం భారత ఆర్థిక వ్యవస్థకు చాలా ముఖ్యమైనవని ఆమె అన్నారు. యువతులను సాంకేతిక నిపుణులుగా, ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దడం ద్వారా దేశాన్ని పటిష్టమైన ఆర్థిక వ్యవస్థ వైపు నడిపించవచ్చు. మహిళలు సాంకేతిక రంగాలలో విభిన్న దృక్కోణాన్ని మరియు నైపుణ్యాలను కలిగి ఉంటారు. మహిళల గ్రహణ సామర్థ్యాలు వివిధ స్థాయిలలో జ్ఞానం మరియు సాంకేతికతలను గ్రహించే శక్తి అధికంగా కలిగి ఉంటారు. మహిళలు తమకు ఎదురయ్యే సవాళ్లను అధిగమించి కెరీర్‌లో ఎదగాలని ఆమె అన్నారు.

విద్యార్థులు స్వయం సాధికారతతో పాటు ఇతరులకు కూడా సాధికారత కల్పించాలని రాష్ట్రపతి సూచించారు. కేవలం తమ విజయం, సంతోషాలతో సంతృప్తి చెందకూడదని ఆమె అన్నారు. దేశం పట్ల మరియు మొత్తం మానవాళి పట్ల వారికి కర్తవ్యం ఉంది. వారు తమ ప్రతిభను మరియు సాంకేతిక సామర్థ్యాలను విస్తృత ప్రయోజనం కోసం ఉపయోగించాలి.

సాంకేతిక ప్రపంచంలోకి ప్రొఫెషనల్‌గా ప్రవేశించేందుకు అనేక మంది యువతులకు జీ ఎన్ ఐ టీ ఎస్ అవకాశాలను కల్పించిందని రాష్ట్రపతి ప్రశంసించారు. మహిళా దక్షతా సమితి మహిళలకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని కొనియాడారు. సమితి ఆధ్వర్యంలోని కళాశాలలు నిరుపేద మహిళలను అభివృద్ధి, సంరక్షణ, పోషణ మరియు సాధికారత కల్పిస్తాయని ఆమె పేర్కొన్నారు.

# రెండు అంతస్తుల 3-డి ప్రింటెడ్ డ్వెలింగ్ యూనిట్‌ను ప్రారంభించిన భారత సైన్యం

న్యూఢిల్లీ, డిసెంబర్ 30భారత సైన్యం 28 డిసెంబర్ 2022న అహ్మదాబాద్ కాంట్ వద్ద సైనికుల కోసం తన మొదటి 3-డి ప్రింటెడ్ హౌస్ డ్వెల్లింగ్ యూనిట్‌ను (గ్రౌండ్ ప్లస్ వన్ కాన్ఫిగరేషన్‌తో) ప్రారంభించింది. మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్ (ఎంఈఎస్)ఎంఐసిఓబి ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి సరికొత్త 3-డి రాపిడ్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీతో ఈ భవంతిని నిర్మించింది.

3డి ప్రింటెడ్ ఫౌండేషన్, గోడలు మరియు స్లాబ్‌లను ఉపయోగించడం ద్వారా గ్యారేజ్ స్థలంతో 71 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నివాస యూనిట్ నిర్మాణ పనులు కేవలం 12 వారాల్లో పూర్తయ్యాయి. విపత్తులను తట్టుకునే విధంగా జోన్-3 భూకంప నిర్మాణాలకు అనుగుణంగా మరియు గ్రీన్ బిల్డింగ్ నిబంధనలను అనుసరించి ఈ నిర్మాణం చేపట్టారు. సాయుధ దళాల సిబ్బందికి పెరుగుతున్న వసతి అవసరాలను తీర్చడానికి ఆధునిక రోజుల్లో వేగవంతమైన నిర్మాణ ప్రయత్నాలకు ప్రతీక ఈ 3-డి నిర్మాణ గృహాలు. 'ఆత్మనిర్భర్ భారత్ అభియాన్'ను ప్రోత్సహించడంలో భారత సైన్యం యొక్క నిబద్ధతకు ఈ నిర్మాణం నిదర్శనం.

ఈ సాంకేతికత కాంక్రీట్ 3డి ప్రింటర్‌ను ఉపయోగించుకుంటుంది. ఇది కంప్యూటరైజ్డ్ త్రీ-డైమెన్షనల్ డిజైన్‌ను అందిస్తుంది. అలాగే దీనికోసం రూపొందించిన ప్రత్యేకమైన కాంక్రీటును వెలికితీసి లేయర్-బై-లేయర్ పద్ధతిలో 3-డి నిర్మాణాన్ని రూపొందించింది.

అహ్మదాబాద్‌లోని ఇండియన్ ఆర్మీకి చెందిన గోల్డెన్ కటార్ డివిజన్ కూడా అనేక రకాల అప్లికేషన్‌లతో ప్రాజెక్ట్‌ను కొనసాగించడంలో కీలకపాత్ర పోషించింది. ఇండియన్ ఆర్మీ యూనిట్‌లు ఇప్పటికే 3డి ప్రింటింగ్ టెక్నాలజీని ముందుగా అమర్చిన శాశ్వత రక్షణ మరియు ఆపరేషన్‌ల కోసం ఉద్దేశించిన ఓవర్‌హెడ్ ప్రొటెక్షన్‌ల నిర్మాణంలో ఉపయోగించాయి. ఈ నిర్మాణాలు ప్రస్తుతం ఒక సంవత్సరం వ్యవధిలో రూపొందుతున్నాయి. కేంద్రపాలిత ప్రాంతమైన లడఖ్‌లో ఉన్న అన్ని భూభాగాలలో ఇటీవల వీటిని గమనించవచ్చు.

# నవంబర్‌లో ఆధార్ ఆధారిత ఈ -కెవైసి లావాదేవీలు 22%, ఆధార్ అథెంటికేషన్ లావాదేవీలు 11% పెరిగాయి

న్యూఢిల్లీ, డిసెంబర్ 30నివాసితుల ఆధార్ వినియోగం దేశవ్యాప్తంగా ప్రగతి పథంలో వెళ్తోంది. ఒక్క నవంబర్‌లోనే, ఆధార్‌ని ఉపయోగించి 28.75 కోట్ల ఈ-కెవైసి లావాదేవీలు జరిగాయి, గత నెలతో పోలిస్తే ఇది 22% వృద్ధి.

నవంబర్ 2022 చివరి నాటికి, ఈ-కెవైసి లావాదేవీల సంచిత సంఖ్య 1350.24 కోట్లకు పెరిగింది. ఆధార్ ఈ-కెవైసి సేవ పారదర్శకమైన, మెరుగైన కస్టమర్ అనుభవాన్ని అందించడం, సులభంగా వ్యాపారం చేయడంలో సహాయం చేయడం ద్వారా బ్యాంకింగ్, నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సేవలకు కీలక పాత్ర పోషిస్తోంది.

ఆధార్ కలిగిన వ్యక్తి స్పష్టమైన సమ్మతి తర్వాత మాత్రమే ఇ-కెవైసి లావాదేవీ అమలు చేయడం జరుగుతోంది. ఈ-కెవైసి కోసం భౌతిక వ్రాతపని, వ్యక్తిగత ధృవీకరణ అవసరాన్ని తొలగిస్తుంది.

అదే విధంగా నవంబర్‌లో, 195.39 కోట్ల ఆధార్ ప్రామాణీకరణ లావాదేవీలు జరిగాయి, అక్టోబర్ కంటే 11% ఎక్కువ. ఈ నెలవారీ లావాదేవీలలో ఎక్కువ భాగం ఫింగర్‌ప్రింట్ బయోమెట్రిక్ ప్రామాణీకరణను ఉపయోగించి జరిగాయి.

ఇప్పటివరకు, నవంబర్ 2022 చివరి నాటికి మొత్తంగా 8621.19 కోట్ల ఆధార్ ప్రామాణీకరణ లావాదేవీలు జరిగాయి, ఇది సుపరిపాలనలో, నివాసితులకు సంక్షేమ బట్వాడాలో ఆధార్ ఎంతగా పాత్ర పోషిస్తుందో సూచిస్తుంది.

గుర్తింపు ధృవీకరణ కోసం ఈ-కెవైసి అయినా, చివరి మైల్ బ్యాంకింగ్ కోసం ఏఈపిఎస్ అయినా, ప్రత్యక్ష నిధుల బదిలీ లేదా ప్రమాణీకరణ కోసం ఆధార్ నిర్ధారిత డీబీటీయేనా, సుపరిపాలన డిజిటల్ అవస్థాపన అయిన ఆధార్, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీకి మద్దతు ఇవ్వడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఇది డిజిటల్ ఇండియా దార్శనికత, నివాసితులకు జీవన సౌలభ్యాన్ని కల్పిస్తుంది.

ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్ (ఏఈపిఎస్) అనేది ఆదాయ పిరమిడ్‌లో దిగువన ఉన్న వారికి ఆర్థిక చేరికను కలిగి ఉంది. మొత్తంగా, నవంబర్ 2022 చివరి నాటికి ఏఈపిఎస్ , మైక్రో ఎటిఎంల నెట్‌వర్క్ ద్వారా 1591.92 కోట్ల లాస్ట్ మైల్ బ్యాంకింగ్ లావాదేవీలు సాధ్యమయ్యాయి.

దేశంలోని 1100 కంటే ఎక్కువ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, కేంద్రం, రాష్ట్రాలు నిర్వహించేవి ఆధార్‌ను ఉపయోగించాలని నోటిఫై చేయడం జరిగింది. డిజిటల్ ఐడి లక్ష్యం లబ్ధిదారులకు సంక్షేమ సేవలను సమర్థత, పారదర్శకత, డెలివరీ చేయడంలో కేంద్రం, రాష్ట్రాల్లోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలకు సహాయం చేస్తోంది.

# భారత ఎన్నికల సంఘం సంసిద్ధత... దేశీయ వలసదారులు తమ రాష్ట్రం వెళ్లనక్కర్లేదు!

న్యూఢిల్లీ, డిసెంబర్ 30సాంకేతిక పరిజ్ఞానం నానాటికీ దూసుకుపోతున్న ఈ యుగంలో వలస కారణంతో ఏదైనా హక్కు నిరాకరణ వాస్తవానికి సమంజసం కాదు. దేశంలో 2019నాటి సార్వత్రిక ఎన్నికల సందర్భంగా 67.4 శాతం ఓటింగ్ మాత్రమే నమోదైంది. అలాగే 30 కోట్లమందికిపైగా ఓటర్లు తమ హక్కును వాడుకోకపోవడం, వివిధ రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటింగ్ శాతం భిన్న స్థాయులలో నమోదు కావడంపైనా భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆందోళన చెందుతోంది. కొత్త నివాస ప్రాంతంలో భిన్న కారణాలతో ఓటర్లుగా పేరు నమోదు చేసుకోనందువల్ల స్వస్థలంలో ఓటు హక్కు వాడుకోవడం సాధ్యం కాదు. ఆ మేరకు అంతర్గత (దేశీయంగా మరో ప్రాంతంలో నివసించే) వలసదారుల ఓటింగ్ సమస్యను పరిష్కరించడం ద్వారా భాగస్వామ్య ఎన్నికల నిర్వహణసహా ఓటింగ్ శాతం మెరుగవుతుంది. దేశీయ వలసలకు సంబంధించి కేంద్రీయ సమాచార నిధి లేనప్పటికీ, వలసలకు ప్రధాన కారణాలైన ఉపాధి, వివాహం, విద్యపరంగా ప్రభుత్వ రికార్డులలో సమాచారం విశ్లేషణకు అందుబాటులోనే ఉంటుంది. మొత్తం దేశీయ వలసలలో ఇతర ప్రాంతాలకు వెళ్లే గ్రామీణ జనాభాయే అత్యధికం. అంతేకాకుండా వలసలలో దాదాపు 85 శాతం ఆయా రాష్ట్రాల మధ్య పరిమితమైంది.

ఈ నేపథ్యంలో శ్రీ రాజీవ్ కుమార్ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించగానే తొలుత చమోలి జిల్లాలో దుర్గమ ప్రయాణంద్వారా దుమాక్ గ్రామాన్ని సందర్శించారు. ఆ గ్రామానికి వెళ్లడంలో ఎదురైన ఇబ్బందుల అనుభవంతో దేశీయ వలస ఓటర్లు తాము ఉంటున్న ప్రాంతం నుంచే ఓటు హక్కు వాడుకునేలా చూడటంపై ఆయన దృష్టి సారించారు. అయితే, ఈ సాధికారత కల్పన ప్రక్రియలో చట్టపరమైనవే కాకుండా, పాలన, సాంకేతిక, నిబంధనల సంబంధిత సవాళ్లు కూడా ఉంటాయని ఈసీఐ గ్రహించింది. ఆ మేరకు అన్ని వలసదారులలోని సామాజిక-ఆర్థిక స్థాయుల ఓటర్లు ఎన్నికలలో భాగస్వాములు కాగల పరిష్కారాన్వేషణ దిశగా ఈసీఐ బృందం విస్తృతంగా చర్చించింది. తదనుగుణంగా పోస్టల్ బాలెట్లను పంపడం-తిరిగి తేవడం, ప్రాతినిధ్య ఓటింగ్, ప్రత్యేక ముందస్తు కేంద్రాల ద్వారా ముందస్తు ఓటింగ్, ఎలక్ట్రానిక్ విధానంలో పోస్టల్ బ్యాలెట్ల బట్వాడా -స్వీకరణ (ఈటీపీబీఎస్), ఇంటర్నెట్ ఆధారిత ఓటింగ్ వంటి వివిధ ప్రత్యామ్నాయాలను పరిశీలించింది.

ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్య పక్షాలన్నింటికీ విశ్వసనీయ, సౌలభ్య, ఆమోదయోగ్య సాంకేతిక పరిష్కారాన్వేషణ లక్ష్యంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ శ్రీ రాజీవ్ కుమార్ నేతృత్వంలోని కమిషన్, ఎన్నికల కమిషనర్లు శ్రీ అనూప్ చంద్ర పాండే, శ్రీ అరుణ్ గోయెల్ ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ మేరకు సుదూర పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రారంభం కోసం సమర్థంగా పనిచేస్తున్న 'ఎం3' ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) సవరించిన నమూనాలను ప్రయోగాత్మకంగా వినియోగించాలని సంకల్పించారు. అంటే- స్వదేశీ వలసదారుల కోసం సొంత నియోజకవర్గం వెలుపలగల పోలింగ్ కేంద్రాలుగా ఇవి ఉపయోగపడతాయి. ఆ మేరకు వలస వచ్చిన ఓటరు తన ఓటు హక్కు వినియోగం కోసం తమ స్వస్థలాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. దేశీయ వలసదారులు తాముంటున్న సుదూర ప్రాంతాల నుంచి- అంటే.. విద్య, ఉపాధి తదితరాల కోసం ప్రస్తుతం నివసిస్తున్న ప్రదేశాలనుంచే స్వస్థలంలోని నియోజకవర్గంలో ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం వీలు కల్పించనుంది. ఇందుకోసం ప్రముఖ ప్రభుత్వరంగ సంస్థతో సంయుక్తంగా 'బహుళ నియోజకవర్గ సుదూర ఎలక్ట్రానిక్ ఓటింగ్ నమూనా యంత్రం' (ఆర్‌వీఎం) రూపొందించడమేగాక ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టడానికి సిద్ధమైంది. ఈ సవరించిన ఈవీఎం ఒకే సుదూర పోలింగ్ కేంద్రం నుంచి 72 బహుళ నియోజకవర్గాల ఓటింగ్‌నిర్వహించగలదు. ఇది పూర్తిస్థాయిలో అమలైతే, వలసదారుల సామాజిక పరివర్తనకు దోహదం చేస్తుంది. తరచూ నివాసాలు మార్చడం, ఆ ప్రాంతాలతో తగిన సామాజిక-భావోద్వేగ సంబంధం లేకపోవడం, శాశ్వత ఆవాసాల్లో నివాసం/ఆస్తి ఉండటం, సొంత నియోజకవర్గంలో పేరు తొలగింపు ఇష్టం లేకపోవడం వంటి కారణాలవల్ల పని ప్రదేశంలో ఓటరుగా నమోదు కావడానికి ఇష్టపడని వారు తమ మూలాలతో సంధానంలో ఉండవచ్చు.

'బహుళ నియోజకవర్గ సుదూర ఎలక్ట్రానిక్ ఓటింగ్ నమూనా యంత్రం' పనితీరును 16.1.2023న ప్రదర్శించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఇందుకోసం గుర్తింపు పొందిన 8 జాతీయ, 57 ప్రాంతీయ (రాష్ట్ర) రాజకీయ పార్టీలకు ఆహ్వానం పంపింది. సాంకేతిక నిపుణుల కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటారు. అనంతరం చట్టాలు, పాలన ప్రక్రియలు, ఓటింగ్ పద్ధతి/ఆర్‌వీఎం/సాంకేతికతల్లో తేవాల్సిన మార్పులు, దేశీయ వలసదారుల సంబంధిత అంశాలు వగైరాలపై 31.01.2023 నాటికి తమ అభిప్రాయాలను, సూచనలను పంపాలని కోరింది. ఆ మేరకు నమూనా యంత్రం పనితీరు ప్రదర్శనపై భాగస్వామ్య పక్షాలన్నిటినుంచి సూచనలు, సలహాలు, అభిప్రాయాలు అందిన తర్వాత 'సుదూర ఓటింగ్' పద్ధతిని తగువిధంగా అమలుచేసేందుకు సిద్ధమవుతుంది.

# తామరస్సేరిలో విద్యార్థులు, యువ భారతీయులతో ముచ్చటించనున్న సహాయమంత్రి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్

న్యూఢిల్లీ, డిసెంబర్ 30కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఽ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, స్కిల్ డెవలప్‌మెంట్ ఽ ఎంట్రప్రెన్యూర్‌షిప్ (ఎలక్ట్రానిక్స్ ఽ సమాచార సాంకేతిక, నైపుణ్యాల అభివృద్ధి ఽ వ్యవస్థాపకత) శాఖ సహాయమంత్రి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ నెలలో రెండవసారి కేరళలో పర్యటించి, విద్యార్థులతో ఽ యువ భారతీయులతో ముచ్చటించనున్నారు. తన పర్యటన సందర్భంగా శుక్రవారం నాడు దక్షిణ తీర నగరమైన కొఝికొడెలో రెండు కార్యక్రమాలలో పాల్గొంటారు.

న్యూ ఇండియా ఫర్ యంగ్ ఇండియా - టెకేడ్ ఆఫ్ ఆపర్చునిటీస్ (యువ భారతం కోసం నూతన భారతం - దశాబ్దంలో భిన్న సాంకేతిక అవకాశాలు)అన్న చొరవ కింద తామరస్సేరిలోని కేథలిక్ బిషప్ హౌజ్ క్యాంపస్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో కేరళలోని 20 కళాశాలలకు చెందిన 1000 మంది విద్యార్థులు, యువతను ఉద్దేశించి మంత్రి ప్రసంగించి, ముచ్చటించనున్నారు. భారతదేశపు డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్నందున, నూతన ఉద్యోగాలు ఽ వ్యవస్థాపకతలకు అవకాశాలను సృష్టిస్తున్నందున డిజిటల్ రంగంలో ఆవిష్కరణలకు మార్గాలను అన్వేషించేందుకు యువ భారతీయులను ప్రోత్సహించడం ఈ సెషన్‌ల లక్ష్యం.

మాజీ చిప్ డిజైనర్, సాంకేతిక వాణిజ్యవేత్త నుంచి రాజకీయవేత్తగా పరిణామం చెందిన శ్రీ రాజీవ్ చంద్రశేఖర్ దేశవ్యాప్తంగా స్టార్టప్‌లు, వ్యవస్థాపకులు సహా యువ భారతీయులను ఆకర్షించి, ప్రోత్సహిస్తున్నారు. అటువంటి సంభాషణలు విద్యార్థులు, విద్యార్థులు, స్టార్టప్ పర్యావరణ వ్యవస్థకు చెందిన వ్యక్తుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఇటీవలే, ఈ సంభాషణల ఫలితంగా గుజరాత్‌లో సంపన్న వ్యక్తులు, కుటుంబ యాజమాన్యాలలోని వ్యాపారులు గుజరాత్‌లోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థకు ప్రేరణను అందించేందుకు రూ. 1500 కోట్ల విలువైన వెంచర్ నిధులు ( వ్యాపారం కోసం నిధుల)ను ఏర్పాటు చేశారు.

మంత్రి కోరన్‌ఫుడ్‌లో ఆల్ఫోన్సా ఇంగ్లీష్ హయ్యర్ సెకెండరీ పాఠశాలలో ఏర్పాటు చేయనున్న మలబార్ యువజన సంగమం కార్యక్రమానికి హాజరై, భారీ స్థాయిలో హాజరుకానున్న యువ భారతీయులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. వీరి సంఖ్య వేలల్లో ఉంటుందని అంచనా.

ఇంతకు ముందు, డిసెంబర్ మొదటివారంలో ఆయన ఐదేళ్ళ వయసులో తాను చదువుకున్న కేరళలోని త్రిస్సూర్‌లో గల సెయింట్ పాల్స్ పాఠశాలను సందర్శించారు.

# లక్ష్మి అపరేషనుకు 10వేల ఆర్థికసాయం

## -డీ.ఎస్.పి కె.నాగేంద్రాచారి చేతులమీదుగా చెక్కు అందజేత

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 30 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ మండలం శాత్రాజుపల్లి గ్రామానికి చెందిన బద్దెపూరి లక్ష్మి గత ఆదివారం బైకు నుండి క్రిందపడడంతో తలకు తీవ్రగాయాలు కావడంతో హుటాహుటిన యశోద హాస్పిటల్ హైదరాబాద్ తీసుకెళ్లడంతో అక్కడి డాక్టర్లు అపరేషనుకు 8 లక్షల వరకు ఖర్చు అవుతుంది అని చెప్పడంతో నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మి కుటుంబ సభ్యులు ఏమిచేయాలో తోచని పరిస్థితుల్లో లక్ష్మి కుమారుడు బద్దెపూరి రాకేషుకు వారి స్నేహితులు మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు వారిని సంప్రదిస్తే వారు కొంత ఆర్థిక సహాయం అందిస్తారని తెలపడంతో





ట్రస్టు సభ్యులను సంప్రదించగా మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు గ్రూపులలో పోస్టు చేయగా దాతల ద్వారా విరాళాల రూపంలో 10వేలు రాగా ఇట్టి రూపాయలు శనివారం రోజున డీ.ఎస్.పి. కె.నాగేంద్రాచారి చేతులమీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది.

ఇట్టి కార్యక్రమంలో మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు సభ్యులు మధు మహేష్, గొంగళ్ళ రవికుమార్, డాక్టర్.బెజ్జంకి రవీందర్, తోట రాజు, జూలపెల్లి రాజు, గొండ ప్రసాద్, మారం కుమార్ తదితరులు పాల్గొన్నారు

# కోవిడ్19 కేసులు కొన్ని దేశాల్లో పెరుగుతున్న నేపథ్యంలో ఫార్మా కంపెనీలతో అవసరమైన మందులు మరియు ఔషధాల స్థితిని సమీక్షించిన కేంద్ర ఆరోగ్య మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా

న్యూఢిల్లీ, డిసెంబర్ 30కేంద్ర ఆరోగ్య ఽ కుటుంబ సంక్షేమం మరియు రసాయనాలు ఽ ఎరువుల మంత్రి, డాక్టర్ మన్సుఖ్ మాండవియా ఈ రోజు ఇక్కడ ఫార్మా కంపెనీల ప్రతినిధులతో కోవిడ్ పరిస్థితి, నిర్వహణ సమర్థత మరియు ఉత్పత్తి సామర్థ్యాలను సమీక్షించారు, తద్వారా భారతదేశం ఎలాంటి పరిస్థితినైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సన్నద్ధమైంది. ప్రపంచవ్యాప్తంగా కొన్ని దేశాల్లో కోవిడ్19 కేసుల పెరుగుదల దృష్ట్యా ఈ సమీక్షా సమావేశం జరిగింది.

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న కోవిడ్ మహమ్మారి వాస్తవ పరిస్థితికి సంబంధించిన నేపథ్యాన్ని ప్రదర్శన రూపంలో కేంద్ర మంత్రికి వివరించారు. దేశంలో కోవిడ్ మహమ్మారి సమయంలో అమూల్యమైన సహకారం అందించినందుకు ఫార్మా కంపెనీలను డాక్టర్ మన్సుఖ్ మాండవియా అభినందించారు. "భారతదేశం యొక్క ఔషధ పరిశ్రమ దృఢమైనది, తట్టుకోగలిగేది మరియు ప్రతిస్పందించేది. వారి సామర్థ్యం కారణంగానే మహమ్మారి సమయంలో డిమాండ్ తగ్గడమే కాకుండా 150 దేశాలకు మందులను సరఫరా చేసే స్థితిలో ఉన్నాం. నాణ్యత తగ్గకుండా, మందుల ధరల పెంపుదల లేకుండానే దీనిని సాధించామని ఆయన నొక్కి చెప్పారు.

ప్రపంచ సరఫరా గొలుసు (గ్లోబల్ సప్లయ్ చైన్) పరిస్థితిని నిశితంగా పరిశీలించాలని ఫార్మా కంపెనీలను కోరారు. ఏ పి ఐ ల ఉత్పత్తి మరియు లభ్యతను అలాగే కోవిడ్ నిర్వహణ కోసం అవసరమైన ముడి ఔషధాల లభ్యతను నిశితంగా పర్యవేక్షించాలని కూడా వారిని కోరారు. కోవిడ్ డ్రగ్స్‌తో సహా అన్ని మందులు తగినంత నిల్వలు మరియు లభ్యతను సరఫరా గొలుసులో రిటైల్ స్థాయి వరకు నిర్ధారించాలని వారిని కోరారు.

కేంద్ర మంత్రి అధ్యక్షతన సకాలంలో జరిగిన ఈ సమీక్షా సమావేశాన్ని ఫార్మా కంపెనీలు అభినందించాయి మరియు తమ మద్దతును కొనసాగిస్తామని హామీ ఇచ్చాయి. కోవిడ్ ఔషధాల సరఫరా గొలుసును తాము నిర్వహించగలమని వారు విశ్వాసం వ్యక్తం చేశారు.

సమీక్షా సమావేశంలో కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి శ్రీ రాజేష్ భూషణ్, శ్రీమతి ఎస్ అపర్ణ, సెక్రటరీ (ఫార్మా), శ్రీ కమలేష్ పంత్, చైర్మన్, ఎన్‌పిపిఎ, డిసిజిఐ డాక్టర్ వి జి సోమాని మరియు ఫార్మాస్యూటికల్ కంపెనీల ప్రతినిధులు సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

# తిరుపతిలో ఫోరెన్సిక్ యూనివర్సిటీ ఏర్పాటు చేయండి.. అమిత్ షాకు ఏపీ సీఎం జగన్ వినతి



న్యూఢిల్లీ, డిసెంబర్ 30తిరుపతిలో నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ (ఎన్ఎఫ్ఎస్‌యు) ఏర్పాటు చేయాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం జగన్ ఈ మేరకు గురువారం ఉదయం గం. 10.30 సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసి విజ్ఞప్తి చేశారు. నిజానికి బుధవారం రాత్రే అమిత్ షా ను కలవాల్సినప్పటికీ, ఆలస్యం కావడంతో ఆయన సమావేశం గురువారం ఉదయానికి వాయిదా పడింది. సుమారు అరగంట పాటు సాగిన ఈ భేటీలో కేంద్ర హోంశాఖతో ముడిపడ్డ అనేకాంశాల గురించి చర్చించారు. బుధవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర అటవీ–పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిసిన సీఎం జగన్ రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై వినతి పత్రాలు అందజేశారు.

గురువారం హోంమంత్రిని కలిసిన జగన్ ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం గుజరాత్ రాష్ట్రంలోని గాంధీనగర్ కేంద్రంగా నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంతో పాటు ఢిల్లీ, గోవా, త్రిపురలలో క్యాంపస్‌లను నెలకొల్పిన విషయాన్ని గుర్తుచేస్తూ.. ఫోరెన్సిక్ సైన్స్, క్రైమ్ ఇన్వెస్టిగేషన్, సెక్యూరిటీ బిహేవియరల్ సైన్స్ మరియు క్రిమినాలజీ రంగాల్లో పరిశోధనలు నిర్వహిస్తూ ఫోరెన్సిక్ నిపుణుల కోసం పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఉన్న కొరతను తీర్చడం కోసం దక్షిణ భారత దేశంలోనూ ఒక యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటికే ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా ఉంటూ, విద్యారంగంలోనూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తిరుపతిలో నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని అమిత్‌షాకు విన్నవించారు. ఈ యూనివర్సిటీ ఏర్పాటుకు అవసమైన భూమిని ఉచితంగా అందించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని హోంమంత్రికి తెలిపారు.

మరోవైపు ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ తాజా పరిణామాల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నామని సీఎం జగన్ హోం మంత్రికి వివరించారు. రాష్ట్ర విభజన జరిగి 8 ఏళ్లు గడిచినప్పటికీ విభజన చట్టంలో పేర్కొన్న అంశాల్లో చాలావరకు ఇప్పటికీ నెరవేర్చలేదని, రెండు రాష్ట్రాల మధ్య ఇంకా కీలక అంశాలు మాత్రం ఇప్పటికీ పరిష్కారం కాలేదని హోంమంత్రికి గుర్తుచేశారు. రీసోర్స్ గ్యాప్ ఫండింగ్, 10వ వేతన సంగం బకాయిలు, పెన్షన్లు మొత్తంగా రూ. 32,625.25 కోట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నాయని, వాటిని వెంటనే మంజూరు చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు బిల్లులు రూ.2,937.92 కోట్లు రెండేళ్లుగా చెల్లించలేదని, వాటిని త్వరగా విడుదలయ్యేలా చూడాలని కోరారు. తెలంగాణ డిస్కంల నుంచి రావాల్సిన రూ.6,886 కోట్ల విద్యుత్ బకాయిలను వెంటనే ఇప్పించాల్సిందిగాహోం మంత్రిని కోరారు. అలాగే జాతీయ ఆహార భద్రతా చట్టంలో హేతుబద్ధత లేని నిబంధనల కారణంగా అర్హత ఉన్న 56 లక్షల కుటుంబాలు పీఎంజీకేఏవై కింద లబ్ధి పొందడం లేదని, నెలకు సుమారు 3 లక్షల టన్నులు రేషన్ బియ్యం కేంద్రం వద్ద మిగిలిపోతున్నాయని, ఇందులో 77వేల టన్నులు రాష్ట్రానికి కేటాయిస్తే అర్హులందరికి ఆహార భద్రతా చట్టం వర్తింపు చేసినట్టువుతుందని తెలిపారు.

రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టంలో పొందుపర్చిన హామీల అమలు గురించి అమిత్ షాతో మాట్లాడారు. రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన తర్వాత వాటి సంఖ్య 26కు చేరిందని, కేంద్రం కొత్తగా మంజూరుచేసిన 3 కాలేజీలతో కలుసుకుని ఇప్పటికి 14 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉన్నాయని, మిగిలిన 12 జిల్లాలకు వెంటనే మెడికల్ కాలేజీలు మంజూరుచేయాలని హోంమంత్రిని కోరారు. కడపలో నిర్మించనన్న సీల్‌ప్లాంటుకు సరిపడా ఖనిజాన్ని అందుబాటులో ఉంచడానికి ఏపీఎండీసీకి గనులు కేటాయించాలని కోరారు.

విశాఖలో 76.9 కిలోమీటర్ల మేర మెట్రో రైల్ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే డీపీఆర్‌ను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామని, ఈ ప్రాజెక్టుకు కావాల్సిన సహాయ సహకారాలు అందించాల్సిందిగా కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న శ్రీశైలం, నాగార్జున సాగర్‌రిజర్వాయర్లకు సంబంధించి పలు అంశాలను అమిత్ షాకు వివరించారు. కృష్ణానదిపై ఉన్న ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులలో తెలంగాణ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని, కృష్ణా రివర్ మేనేజిమెంట్ బోర్డు యొక్క అన్ని ఆపరేషనల్ ప్రోటోకాల్స్‌ను, ఒప్పందాలను, ఆదేశాలను ఉల్లంఘిస్తోందని పేర్కొన్నారు. "ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం 974 కిలోమీటర్ల విస్తారమైన తీరప్రాంతంతో అపారమైన ఆర్థిక కార్యకలాపాలకు అనువుగా ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రామాయపట్నం, మచిలీపట్నం, భావనపాడులలో మూడు గ్రీన్ ఫీల్డ్ పోర్టులను అభివృద్ధి చేస్తున్నాం. రామాయపట్నం ఓడరేవుకు సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

మార్చి, 2024 నాటికి పోర్ట్ కార్యకలాపాలు కూడా ప్రారంభం కానున్నాయి. మిగిలిన రెండు పోర్టుల కోసం కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం, శ్రీకాకుళం జిల్లాలోని భావనపాడు పోర్ట్‌లలో పర్యావరణ అనుమతులు మంజూరుకు వీా సహకారం అందించాలని కోరుతున్నాం" అని కేంద్రమంత్రిని కోరారు. పంప్డ్ స్టోరేజ్ సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి అనుకూలమైన స్థలాలను గుర్తించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందంజలో ఉందని, అదే విధంగా పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల ప్రమోషన్ కోసం పాలసీని కూడా రూపొందించిందని, ఆ తరహా ప్రాజెక్టులలో ఎర్రవరం, కురికుట్టి, సోమశిల, అవుకు వంటి చోట్ల ఏర్పాటు జరుగుతోందని, ఆ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని కేంద్ర హోంమంత్రిని సీఎం జగన్ కోరారు.

## జనవరి 2న 'వారాహికి' కొండగట్టులో ప్రత్యేక పూజలు

జగిత్యాల, డిసెంబర్ 30 పవర్ స్టార్ పవన్ కల్యాణ్ జనసేన ప్రచార వాహనం వారాహికి జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వచ్చే ఏడు జనవరి 2వ తేదీన వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని నిర్వహించనున్నారు.

జనసేన నేతలు వాహన పూజకు ఏర్పాట్లు చేస్తున్నారు. కొండగట్టు ఆంజనేయ స్వామిని పవన్ కళ్యాణ్ అధికంగా విశ్వసించే విషయం అందరికీ విదితమే. ఈ క్రమంలోనే వారాహికి ప్రత్యేక పూజలు కొండగట్టు నిర్వహించాలని పవన్ నిర్ణయించారు.

## హరినాథ రావు కుటుంబానికి పరామర్శ



కరీంనగర్, డిసెంబర్ 30ఫరాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ వియ్యంకుడు, రాష్ట్ర మున్సిపల్ శాఖ మాత్యులు కేటీఆర్ మామ పాకాల హరినాథరావు కుటుంబాన్ని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డిలు పరామర్శించారు. శుక్రవారం హైదరాబాదులోని రాయదుర్గంలో హరినాథరావు కుటుంబ సభ్యులను ఓదార్చి, సానుభూతి వ్యక్తం చేశారు.. గురువారం గుండెపోటుతో హరినాథం రావు మృతి చెందిన విషయం విధితమే. హరినాథ్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.

## వైసీపీ అరాచక పాలనను తరిమికొట్టేందుకు ప్రజలంతా కలిసి పోరాడాలి

### –సీఎం జగన్.. అప్పుల అప్పారావు: చంద్రబాబు కామెంట్

అమరావతి డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);వైసీపీ అరాచక పాలనను తరిమికొట్టేందుకు ప్రజలంతా కలిసి పోరాడాలని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. అడ్డు అదుపు లేకుండా చేస్తున్న అప్పులతో సీఎం జగన్ రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారని మండిపడ్డారు. టీడీపీ సభలకు వస్తున్న స్పందనకు భయపడే అడ్డుకోవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అవినీతి ప్రభుత్వానికి చరమగీతం పలికేందుకు ఇంటికొకరు టీడీపీ జెండా పట్టుకుని రావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.సీఎం జగన్ను 'అప్పుల అప్పారావు' అంటూ చంద్రబాబు ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి సంబంధించి 18 మంది ముఖ్యమంత్రులు 2019 నాటికి 3.62 లక్షల కోట్లు అప్పులు చేస్తే కేవలం మూడున్నరేళ్లలోనే జగన్ 6.37 లక్షల కోట్ల అప్పు చేశారని ధ్వజమెత్తారు. 10 లక్షల కోట్ల రూపాయల అప్పులతో రాష్ట్రాన్ని మరో శ్రీలంకలా మారుస్తున్నారని మండిపడ్డారు. దేశంలోని అందరి ముఖ్యమంత్రుల ఆస్తులు 310 కోట్ల రూపాయలైతే ఒక్క సీఎం జగన్ ఆదాయం మాత్రం 375 కోట్లు రూపాయలని ఓ సర్వేలో తేలిందని చంద్రబాబు ప్రస్తావించారు. వచ్చే ఎన్నికల్లో ఓటును 10వేలు 20వేలు వరకు కొనుగోలు చేయటంతో పాటు నాయకులను కొనేందుకు సిద్ధంగా ఉన్నారని ఆరోపించారు. 16లక్షల రేషన్ కార్డులను తొలగించటంతో పాటు మహిళా పోలీసులతో అడగరాని ప్రశ్నలు అడిగిస్తూ భార్యాభర్తల మధ్య అగ్గి రాజేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను రూపొందించుకొని ముందుకు వెళ్ళాలి

### –పి కే ఎస్ జి స్మారక ఫౌండేషన్ చేర్మెన్ పాలకుర్ల మురళి గౌడ్



చౌటుప్పల్ డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి ఉన్నత లక్ష్యాలను రూపొందించుకొని ఆ దశలో కృషి చేయాలని పాలకుర్ల శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ చేర్మెన్ పాలకుర్ల మురళి గౌడ్ సూచించారు. ప్రాథమికోన్నత పాఠశాల గుడిమల్కాపూర్ మండలం నారాయణపురం పాఠశాల విద్యార్థి విద్యార్థులకు పాలకూరల శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ చౌటుప్పల్ వారి ఆధ్వర్యంలో జీకే క్విజ్ వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల పాఠశాలకు రెగ్యులర్ గా హాజరయ్యే విద్యార్థులకు ప్రోత్సకా ప్రోత్సాహక అందజేస్తామన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు పోషకాహారం అందించే ఉద్దేశంతో మధ్యాహ్న భోజనంలో చికెన్ అందించడం జరిగింది. పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న పేద విద్యార్థిని రంజాన్ బికి ?2,000 అధిక సాయం పాలకొల్లు మురళి గౌడ్ అందజేశం అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి మంజువాణి శ్రీ మాట్లాడుతూ విద్యార్థులందరూ కష్టపడి చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి కల్పన, కే రూప, జి వెంకటేశం, యం మమత, సంస్థ సభ్యులు కరుణ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

## సరిహద్దు భద్రతా దళం (బిఎస్ఎఫ్) మొబైల్ యాప్ 'ప్రహరి'ను, 13 మాన్యువల్స్ సవరించినవెర్షన్ ను న్యూఢిల్లీలో ఆవిష్కరించిన కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, డిసెంబర్ 30సరిహద్దు భద్రతా దళం (బిఎస్ఎఫ్) మొబైల్ యాప్ 'ప్రహరి', మాన్యువల్ ఆఫ్ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్ఎఫ్) ను కేంద్ర హోం,సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఈ రోజు న్యూఢిల్లీలో ఆవిష్కరించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి శ్రీ నిత్యానంద్ రాయ్, కేంద్ర హోం శాఖ కార్యదర్శి, బిఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులు ,హోం మంత్రిత్వ శాఖ, కేంద్ర పాలిత ప్రాంతాలు, బిఎస్ఎఫ్ కు చెందిన పలువురు సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేంద్ర హోం,సహకార మంత్రి శ్రీ అమిత్ షా తన ప్రసంగంలో, బిఎస్ఎఫ్ 'ప్రహరి' యాప్ క్రియాశీల పాలనకు గొప్ప ఉదాహరణ అని అన్నారు. ఇప్పుడు జవాన్లు సమాచారాన్ని, వసతి, ఆయుష్మాన్–సిఎపిఎఫ్, సెలవులకు సంబంధించిన వ్యక్తిగత తమ మొబైల్స్ లో పొందవచ్చు. జిపిఎఫ్, బయో డేటా ఇంకా "సెంట్రలైజ్డ్ పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెస్ అండ్ మానిటరింగ్ సిస్టమ్" (సిపి–జి ఆర్ ఎ ఎం ఎస్) పై ఫిర్యాదుల పరిష్కారం, వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించిన సమాచారాన్ని ఇప్పుడు జవాన్లు సమాచారాన్ని యాప్ ద్వారా పొందవచ్చు ఇంకా ఈ యాప్ వారిని హోం మంత్రిత్వ శాఖ పోర్టల్ తో కూడా అనుసంధానిస్తుంది. దీనితో పాటు, కార్యకలాపాలు, పరిపాలన ,శిక్షణపై అవగాహన పెంచడానికి , పనిని వేగవంతం చేయడానికి 13 మాన్యువల్స్‌లో ఎదురుచూస్తున్న సవరణ, నవీకరణ కోసం కృషి చేసిన బి ఎస్ ఎఫ్ డైరెక్టర్ జనరల్ శ్రీ పంకజ్ కుమార్ ను, ఆయన బృందాన్ని అమిత్ షా అభినందించారు. ఇది బిఎస్ఎఫ్ జవాన్లు అధికారుల అన్ని ర్యాంకుల పనిని సులభతరం చేస్తుందని తాను ఖచ్చితంగా అనుకుంటున్నానని శ్రీ షా అన్నారు. ఈ కొత్త కార్యక్రమాలు బిఎస్ఎఫ్ పనిలో సౌలభ్యాన్ని తీసుకువస్తాయని ఆయన అన్నారు.

దేశంలో అత్యంత క్లిష్టమైన సరిహద్దును బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ కాపాడుతోందని హోం మంత్రి చెప్పారు. అటల్ జీ 'వన్ బోర్డర్ వన్ ఫోర్స్' ను ఆవిష్కరించిన తరువాత, పాకిస్తాన్ ,బంగ్లాదేశ్ లతో మన సరిహద్దుల బాధ్యత బిఎస్ఎఫ్ పరిధి లోకి వచ్చిందని, ధైర్యవంతులైన బిఎస్ఎఫ్ సైనికులు ఈ సరిహద్దులను గొప్ప అప్రమత్తత, శక్తితో సకాలంలో స్థిరమైన ప్రయత్నాలతో నిర్వహిస్తున్నారనిఅన్నారు. దేశ సరిహద్దుల భద్రతకు స్తంభాలు లేదా కంచెలు సరిపోవని, ఆ సరిహద్దులో నిలబడి ఉన్న సైనికుల ధైర్యం, దేశభక్తి, అప్రమత్తత ద్వారా మాత్రమే భద్రత సాధ్యమని అని ఆయన అన్నారు. దేశ హోం మంత్రిగా బిఎస్ఎఫ్ జవానుల ధైర్యాన్ని, అప్రమత్తతను ఈ సందర్భంగా అభినందిస్తున్నానని చెప్పారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇటీవల వైబ్రెంట్ విలేజ్ కార్యక్రమాన్ని ప్రారంభించారని శ్రీ అమిత్ షా గుర్తు చేస్తూ, వైబ్రెంట్ విలేజ్ కార్యక్రమం ద్వారా గ్రామంలో పర్యాటకాన్ని పెంపొందించి, పూర్తి సౌకర్యాలతో గ్రామాన్ని స్వయం సమృద్ధి సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని సరిహద్దు భద్రతా దళాలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

సరిహద్దుల్లో సైనికులను మోహరించడంతో పాటు సరిహద్దు గ్రామాలు జన సమ్మర్థంగా ఉన్నప్పుడు సరిహద్దుల వద్ద భద్రతపటిష్టమవుతుందని, గ్రామాల్లో నివసించే దేశభక్త పౌరుల ద్వారా మాత్రమే శాశ్వత భద్రత కల్పించబడుతుందని, అన్ని సరిహద్దు రక్షక దళాలు దానిని బలోపేతం చేయాలని శ్రీ షా అన్నారు.

సరిహద్దు భద్రతా దళానికి సుదీర్ఘ చరిత్ర ఉందని, ఒక మహావీర్ చక్ర, 4 కీర్తి చక్రాలు, 13 వీర చక్రాలు, 13 శౌర్య చక్రాలతో సహా అనేక శౌర్య పురస్కారాలతో గౌరవించబడిందని హోం మంత్రి తెలిపారు. బి.ఎస్.ఎఫ్ ఎంత ధైర్యసాహసాలతో ఎన్నో యుద్ధాలు చేసిందంటే ప్రతి యుద్ధంపై ఒక పుస్తకం రాయవచ్చు అని అన్నారు.

గత మూడేళ్లలో బీఎస్ఎఫ్ ద్వారా 26,000 కిలోల మాదకద్రవ్యాలు, 2,500 ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని హోం మంత్రి తెలిపారు. సరిహద్దులో యాంటీ డ్రోన్ టెక్నాలజీ ఇంకా ప్రయోగాత్మక దశలోనే ఉన్నప్పటికీ, ఇది చాలావరకు విజయవంతమైందని ఆయన అన్నారు.

గత ఆరు నెలల్లో పశ్చిమ సరిహద్దులో 22 డ్రోన్లను బీఎస్ఎఫ్ కూల్చివేసిందని, ఇది గొప్ప విజయమని అన్నారు. దుష్ట ఉద్దేశాలతో మాదకద్రవ్యాలు , ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేయడానికి ఆయుధాలను మోసుకెళ్లే డ్రోన్లపై కూడా విజయం సాధిస్తున్నట్టు తెలిపారు. నోయిడాలో "బిఎస్ఎఫ్ డ్రోన్ / యుఎవి ,సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్" ను ఏర్పాటు చేశామని, దీని ద్వారా స్వాధీనం చేసుకున్న డ్రోన్లను సరిహద్దు వెంబడి వాటి లింకేజీలు. ప్రదేశాల కోసం క్షుణ్ణంగా మ్యాప్ చేసినట్లు కేంద్ర హోంమంత్రి తెలిపారు.

సరిహద్దులోని కొన్ని ప్రాంతాల్లో స్థలాకృతి క్లిష్టంగా ఉన్నందున ఫెన్సింగ్ చేయలేకపోయామని శ్రీ అమిత్ షా అన్నారు. బిఎస్ఎఫ్ అక్కడ ఎలక్ట్రానిక్ నిఘా కోసం అంతర్గత సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసింది, దీని ఖర్చు చాలా తక్కువ, సామర్థ్యం చాలా ఎక్కువ అని అన్నారు. నిరంతర నిఘాతో సరిహద్దును బిఎస్ఎఫ్ సిబ్బంది సురక్షితంగా ఉంచగలిగారని శ్రీ షా అన్నారు. క్లిష్ట ప్రాంతాల్లో 140 కిలోమీటర్ల మేర ఫెన్సింగ్, 400 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం పూర్తయింది. వీటితో పాటు 120కి పైగా సరిహద్దు ఔట్ పోస్టులను నిర్మించారు. సరిహద్దు వద్ద బీఎస్ ఎఫ్ జవాన్లు మైనస్ 40 నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రతల్లో నిలబడి దేశాన్ని కాపాడుతున్నట్లే వారి కుటుంబాలను మోదీ ప్రభుత్వం అంతే జాగ్రత్తగాచూసుకుంటున్నదని చెప్పారు. వారికిగృహనిర్మాణం కోసం ఒక కొత్త యాప్ ప్రారంభం అయిందని, ప్రారంభించిన రెండు నెలల్లోనే గృహ సంతృప్తి నిష్పత్తి 10% పెరిగిందని, ఇది భారీ విజయం అని శ్రీ షా అన్నారు. క్రియాశీల పాలనకు ఇది ఒక గొప్ప ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు.

సరిహద్దు భారతదేశం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేసిందని కేంద్ర హోం, సహకార మంత్రి అన్నారు. తొమ్మిది ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ లను అభివృద్ధి చేశారు. మరో 14 నిర్మించే ప్రక్రియలో ఉన్నారు. సరిహద్దు జిల్లాల్లో భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే సంక్షేమ కార్యక్రమాలన్నీ జిల్లా కలెక్టర్ లసహకారంతో 100% అమలు చేయాల్సిన అవసరం ఉందని హోంమంత్రి బిఎస్ఎఫ్ సీనియర్ అధికారులకు సూచించారు. ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ యోజనతో సరిహద్దు గ్రామాలను వదిలి వెళ్తున్న ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తే వారు గ్రామంలో ఉండటానికి ఒక కారణం లభిస్తుందని ఆయన అన్నారు. గ్యాస్, విద్యుత్, త్రాగునీటి సదుపాయాలు వారికి కల్పిస్తే, తమను జాగ్రత్తగా చూసుకునే వారు ఉన్నారనే భరోసా కలిగి వారు గ్రామాలలోనే ఉండిపోతారని ఆయన అన్నారు. దేశ స్వావలంబన కోసం ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ చేపట్టిన కార్యక్రమాలను సరిహద్దు ప్రాంతాల్లో ప్రాధాన్యతతో అమలు చేయాలని, ఇందులో దేశ సరిహద్దులలో మోహరించిన భద్రతా దళాలు, ముఖ్యంగా బిఎస్ఎఫ్ లకు ముఖ్యమైన పాత్ర ఉందని హోం మంత్రి అన్నారు.

## కరోనాపై 'భారత్' కలతచెందాల్సిన అవసరం లేదు!

హైదరాబాద్ డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పొరుగుదేశమైన చైనాలో కరోనా కేసులు పెరిగిపోతుండటంతో ప్రపంచ దేశాలు మళ్లీ కలవరపడుతున్నాయి. గతంలో కరోనా వైరస్ చైనా నుంచే వ్యాపించందనే వార్తలున్న నేపథ్యంలో ప్రపంచదేశాల్లో ఆందోళన చెలరేగడం సహజమే. ఇదే సందర్భంలో చైనాతో సరిహద్దును కలిగివున్న మన దేశంలో కూడా ఒకింత ప్రభావం ఉంటుందని అందరూ భావిస్తూ వస్తున్నారు. నిజానికి చైనాలో కరోనా మళ్లీ విజృంభించడానికి ఆ దేశ ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యలే కారణంగా తెలుస్తున్నది. చైనాలో కరోనాను కట్టడి చేయడంలో అక్కడి ప్రభుత్వం వైఫల్యం చెందడంతో, ఆ దేశ ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలను చేపట్టినట్లుగా వార్తలు అందుతున్నాయి. చైనాలో అవలంభించిన జీరో కోవిడ్ పాలసీని కఠినంగా అమలు చేసేందుకు జిన్ పింగ్ ప్రభుత్వం కఠిన నిబంధనలను అవలంభించేందుకు ప్రయత్నించడమే అక్కడ ప్రస్తుతమున్న పరిస్థితికి కారణమని పలువురు అంతర్జాతీయ వైద్య, సామాజిక, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతుండటం గమనార్హం. ప్రజాగ్రహానికి తలొగ్గి జిన్ పింగ్ ప్రభుత్వం జీరో కోవిడ్ పాలసీపై వెనుకంజ వేసింది.

భారత్ కు ఆందోళన అవసరం లేదు :

దేశంలో మరో కరోనా వేవ్ రాకపోవచ్చని పలు జాతీయ, అంతర్జాతీయ అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. ఇప్పటికే పలు దఫాలుగా కరోనా వైరస్ సోకడంతో ప్రజలకు సహజ రోగనిరోధక శక్తి వచ్చినట్లైందంటున్నారు. దేశంలోని 90% జనాభాకి సహజ నిరోధకత వచ్చిందనే విషయాన్ని ఐఐటి కాన్పూర్ మోడల్ సూత్రం కూడా స్పష్టం చేసింది. కొత్త వేరియంట్లు వెలుగులోకి వచ్చినట్లుగా వస్తున్న వార్తలపై విభిన్న కథనాలున్నాయి. చైనాలో వచ్చిన బిఎఫ్.7 అనే వేరియంట్ జూలై నుంచే మన దేశంలో ఉన్నట్లుగా పలువురు డాక్టర్లు స్పష్టం చేశారు. వైరస్ మ్యుటేషన్ లో వచ్చిందే కానీ చైనా లేదా ఇతర దేశాల నుంచి వచ్చింది కాదని పలువురు వైద్య నిపుణులు ఇప్పటికే స్పష్టం చేశారు. బిఎఫ్.7 వేరియంట్ పై భారత్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిపుణులు తెలుపుతున్నారు. ఈ వేరియంట్ భారత ప్రజలకు తీవ్రమైన ప్రమాదాన్ని కలిగించదంటున్నారు. అయితే ఎల్లప్పుడూ ప్రజలు గుంపులుగుంపులుగా ఉండకుండా చూసుకుంటూ ఫేస్ మాస్క్ లను ధరించడం మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పటికే భారత్ లో కన్పించిన మూడు వేవ్ లు సహజంగానే లక్షలాది మందికి రోగనిరోధక శక్తిని ఇచ్చినవని వారు తెలియజేస్తున్నారు. చాలా మంది భారతీయులు హైబ్రిడ్ రోగనిరోధక శక్తిని పొందారు. అంటే వ్యాక్సిన్‌ల ద్వారా రోగనిరోధక శక్తి అభివృద్ధి చెందిందని, వివిధ కోవిడ్ వేరియంట్‌ల నుండి వారిని రక్షించే సహజ సంక్రమణం లభించిందని అంతర్జాతీయ వైద్య నిపుణులు స్పష్టం చేస్తుండటంతో భారత్ కు ఎంతో ఊరట కలిగింది. భారత ప్రజలు కొత్త వేరియంట్ల పట్ల తీవ్ర ఆందోళన చెందాల్సిన అవసరం ఏమీ లేదని తెలియవస్తున్నది.

## ముగిసిన రాష్ట్రపతి శీతాకాల దక్షిణాది విడిది

హైదరాబాద్ డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల దక్షిణాది విడిది ముగిసింది. దీంతో రాష్ట్రపతి హైదరాబాద్ నుంచి ఢిల్లీకి ప్రత్యేక విమానంలో బయల్దేరారు. హాకీంపేట్ ఎయిర్‌బేస్‌లో రాష్ట్రపతికి గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి సత్యవతి రాథోడ్ వీడ్కోలు పలికారు. శీతాకాల విడిది నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిన ద్రౌపది ముర్ము.. భద్రాద్రి, యాదాద్రి, రామప్ప ఆలయాలను సందర్శించారు. ఈ నాలుగు రోజుల పాటు ముర్ము.. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేశారు.రాష్ట్రపతి ద్రౌపదీముర్ము శీతాకాల విడిది కోసం సోమవారం తెలంగాణకు వచ్చిన సంగతి తెలిసిందే. హాకీంపేట్ ఎయిర్‌బేస్‌లో రాష్ట్రపతి ముర్ముకు సీఎం కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు ఘనస్వాగతం పలికారు.

## వికలాంగులను ఆదరించాలి : మాహియా రాజ్



హైదరాబాద్ డిసెంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );వికలాంగుల దినోస్సత్సవం,దివ్యకళా ఫౌండేషన్, డాన్స్ అకాడమి ప్రథమ వార్శికోత్సవం పురస్కరించుకొని మల్కాజ్గిరి లో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ ఆక్టివిస్ట్ ఎంజే సిస్టర్స్ ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆక్టివిస్ట్ ఎంజే సిస్టర్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రదాన కార్యదర్శి మాహియా రాజ్ మాట్లాడుతూ నేడు దివ్యకళా ఫౌండేషన్ ప్రథమ వార్శికోత్సవం సందర్భంగా వికలాంగుల దినోస్సత్సవం జరుపడం అభినందనీయమన్నారు. నేడు ప్రపంచం లో అనేక మంది అనేక విదాలై అంగ వైకల్యం తో బాదపడుతున్నారని ఐనప్పటికీ వారు మేము వికలంగులం కాదు సకలాంగులం అని నిరూపించుకోవడం అభినందనీయమన్నారు. వికలాంగులను ఆదరించవలసిన భాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. ఇలాంటి వారిని దివ్యకళా ఫౌండేషన్ గుర్తించి సన్మానించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ ఆక్టివిస్ట్ ఎంజే సిస్టర్స్ జ్యోతి, డాన్ మాహియా రాజ్, వాణి రెడ్డి లను ఘంగ సత్కరించారు. ఈ కార్యక్రమం లో సంస్థ ఫౌండర్ చర్మెన్ గడ్డం సంతోష్ సునీతా తదితరులు పాల్గొన్నారు.


కళావేదిక కల్చరల్ & ఛారిటబుల్ ట్రస్ట్ & నవసాహితి ఇంటర్నేషనల్

సంయుక్త ఆధ్వర్యంలో

శ్రీమతి సాలిపల్లి మంగామణి (శ్రీమణి) విరచిత

మణిదీపాలు

కవితా సంపుటి ఆవిష్కరణ



పౌర గ్రంథాలయం, హాల్ నెం.1, ద్వారకానగర్, విశాఖపట్నం.

తేది 3-01-2023 మంగళవారం సా॥ 6:00 గం॥లకు

సభాధ్యక్షులు :
డా॥ నండూరి రామకృష్ణ గారు
కళావేదిక, వ్యవస్థాపక అధ్యక్షులు

ముఖ్య అతిథి :
పద్మశ్రీ డా॥ కూటికుప్పల సూర్యారావు గారు
సుప్రసిద్ధ వైద్యులు, కవి, విమర్శకులు

విశిష్ట అతిథి : డా॥ సజ్జా మోహన్‌రావు గారు, విశ్రాంత ఆచార్యులు, ఆంధ్ర విశ్వవిద్యాలయం

కవితా సంపుటి విశ్లేషకులు: సాహితీరత్నాకర డా॥డి.వి. సూర్యారావు గారు, విశ్రాంత ఆచార్యులు, బి.వి.కె. కళాశాల

ఆత్మీయ అతిథులు : శ్రీ ఎస్.వి. సూర్యప్రకాశరావు గారు, వ్యవస్థాపక అధ్యక్షులు, నవసాహిత్య ఇంటర్నేషనల్, చెన్నై
శ్రీ ఆర్.ఆర్. విద్యాసాగర్ గారు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, (ఆర్ & బి)
డా॥ బి. రజని గారు, తెలుగు ఉపన్యాసకులు

శ్రీమతి శ్రీమణి
కార్యదర్శి

అందరూ ఆహ్వానితులే

# నర్సరీలో జరుగుతున్న పనులను పరిశీలించిన ఎంపిపి ఈదురు రాజేశ్వరి.



మహబూబాబాద్, డిసెంబర్ 30(నేటినిజం ప్రతినిధి): పెద్ద వంగర మండలంలోని చిట్యాల గ్రామంలో నర్సరీలో జరుగుతున్న బ్యాగ్ ఫిల్లింగ్ పనులు మరియు పల్లె ప్రకృతి వనాలను పరిశీలించినా పెద్దవంగర ఎంపిపి ఈదురు రాజేశ్వరి పరిశీలించారు

అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని నర్సరీలలో జరుగుతున్న బ్యాగ్ ఫిల్లింగ్ పనులు ప్రభుత్వం నిర్ణయించిన మేరకు నాణ్యత ప్రమాణాలతో చెయ్యాలని తెలిపారు. బ్యాగ్ ఫిల్లింగ్ చేసేటప్పుడు పలు జాగ్రత్తలతో చేయించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శికి చూసించారు. తరువాత మొక్కల సీడ్ మంచిగా ఎదుగుదల వచ్చేటట్లు శ్రద్ధ చూసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ఇంచార్జి సర్పంచ్ ఈదురు లచ్చమ్మ, ఎంపిఓ సత్యనారాయణ, జూనియర్ పంచాయతీ కార్యదర్శి రాజు, టిఎలు సురేష్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# తుది పరీక్షలకు అర్హత సాధించిన 685మంది అభ్యర్థులు



ఖమ్మం, డిసెంబర్ 30 (నేటినిజం ప్రతినిధి): పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో స్టైపండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్స్, కానిస్టేబుల్ అభ్యర్ధుల ఎంపిక ప్రక్రియలో భాగంగా శుక్రవారం జరిగిన దేహదారుఢ్య పరీక్షలకు 1143 మంది హజరైయ్యారని పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ తెలిపారు. ఇందులో 685 మంది అభ్యర్థులు తుది పరీక్షలకు అర్హత సాధించారని తెలిపారు. శుక్రవారం మొత్తం1328 మంది అభ్యర్థులు హాజరు కావాల్సివుండగా1143 మంది హజరై ఈవెంట్లలో పాల్గొన్నారని తెలిపారు.

# తెలంగాణ ఏర్పడిన తర్వాతే కులవృత్తులకు న్యాయం: మంత్రి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్‌నగర్, డిసెంబర్ 30 తెలంగాణ ఏర్పడిన తర్వాతే కులవృత్తులకు న్యాయం జరుగుతున్నదని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలోనే గోపాల మిత్రలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. మహబూబ్‌నగర్‌లోని బండమీదిపల్లిలోని పరిశోధనా కేంద్రం ఎక్కడికీ తరలిపోదని స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని బండమీదిపల్లిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో గోపాలమిత్రల వేతనం రూ.3 వేలు మాత్రమే ఉండేదని, తెలంగాణ ఏర్పడిన తర్వాత దానిని రూ.11 వేలకు పెంచామన్నారు.

గోపాల మిత్రల సేవలు విస్తరించడంతోనే పశుసంపద పెరిగి పాల ఉత్పత్తిలో రాష్ట్రం ముందుందని చెప్పారు. పాడి పరిశ్రమను ఇంకా పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. గోపాల మిత్రల సేవలు ఎంతో విలువైనవని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో తాము సంతోషంగా ఉన్నామని, గుర్తింపు, గౌరవం లభిస్తున్నాయని గోపాల మిత్రలు పేర్కొనడం సంతోషకరమన్నారు.

మహబూబ్‌నగర్ జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానానికి తీసుకుపోవడమే తమ లక్ష్యమని మంత్రి చెప్పారు. అందులో భాగంగానే గతంలో ఎప్పుడూ జరగనంత అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.

జిల్లా కేంద్రంలో నూతన కోర్టు కాంప్లెక్స్ భవన నిర్మాణం కోసం వెటర్నరీ పాలిటెక్నిక్ సమీపంలో 10 ఎకరాల స్థలాన్ని కేటాయించామని, దానికి బదులుగా పశుపరిశోధన కేంద్రానికి 20 ఎకరాల భూమిని కేటాయిస్తున్నామని తెలిపారు.

వెటర్నరీ పాలిటెక్నిక్, పశుపరిశోధన కేంద్రం ఇక్కడి నుంచి తరలిపోతున్నాయని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, వాటిని ఎక్కడికీ తరలించడం లేదని స్పష్టం చేశారు.

# సత్ప్రవర్తన కలిగిన 120 మంది హిస్టరీ సీట్లను క్లోస్ చేసిన జిల్లా ఎస్పీ రమణ కుమార్ .

సంగారెడ్డి డిసెంబరు 30 (నేటి నిజం ప్రతినిధి) సంగారెడ్డి సబ్ డివిజన్ కు చెంది, సత్ప్రవర్తన కలిగిన 120 మంది హిస్టరీ సీట్లను క్లోస్ చేసిన జిల్లా ఎస్పీ యం. రమణ కుమార్ .

సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయం (పోలీస్ కళ్యాణమండపం) నందు సంగారెడ్డి సబ్ డివిజన్ కు చెందిన నేర ప్రవృత్తి గల హిస్టరీ షీటర్లతో ఎస్పీ స్వయంగా మాట్లాడుతూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. వారు ఎక్కడ నివసిస్తున్నారు, ఎక్కడ పనిచేస్తున్నారు అన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో చేసిన పొరపాట్లను తిరిగి పునరావృతం కాకుండా బాధ్యత గల పౌరులుగా జీవించాలన్నారు.

గత 15 సంవత్సరాలుగా ఎలాంటి నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తన కలిగిన మరియు వయసు పైబడిన మొత్తం 120 మంది హిస్టరీ సీట్లను క్లోస్ చేసియడం జరిగిందన్నారు.

ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డి.ఎస్.పి రవీంద్రారెడ్డి, సంగారెడ్డి పట్టణ సి.ఐ. శ్రీధర్ రెడ్డి, సంగారెడ్డి రూరల్ సి.ఐ. శివలింగం, మరియు సంగారెడ్డి సబ్-డివిజన్ ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# స్టార్టప్‌ల ప్రయోజనాల కోసం జనవరి 1, 2023 నుండి నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సాంకేతిక వాణిజ్యీకరణను చేపట్టనుందని తెలిపిన కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 302023 జనవరి 1 నుంచి నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఆర్‌డిసి) స్టార్ట్ అప్‌ల ప్రయోజనం కోసం సాంకేతిక వాణిజ్యీకరణను చేపట్టనుందని కేంద్ర సైన్స్ ఢ టెక్నాలజీ సహాయమంత్రి (స్వతంత్ర బాధ్యత), ఎర్త్ సైన్సెస్ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), ఎంఒఎస్ పిఎంఓ, పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్‌లు, అటామిక్ ఎనర్జీ మరియు స్పేస్ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈరోజు తెలిపారు.

1953లో స్థాపించబడిన నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఆర్‌డిసి) అనేది డిఎస్ఐఆర్ కింద ఒక పీఎస్ఈసెక్షన్ 8 కంపెనీ. ఇది ఆర్ అండ్ డి మరియు పరిశ్రమల వారధిలో కీలక పాత్ర పోషిస్తోంది.

న్యూఢిల్లీలోని సిఎస్ఐఆర్ సెంటర్‌లో కార్యదర్శి, డిఎస్ఐఆర్ మరియు ఎన్ఆర్‌డిసి సీనియర్ అధికారుల సమావేశానికి అధ్యక్షత వహించిన డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ ఎన్ఆర్‌డిసి ప్రారంభం నుండి దాదాపు అన్ని పరిశ్రమల రంగాలలో సాంకేతికతలకు ప్రాతినిధ్యం వహించే 5000 కంటే ఎక్కువ లైసెన్స్ ఒప్పందాలను కుదుర్చుకుంది. భారతదేశంలో 2000కు పైగా పేటెంట్లను ఫైల్ చేయడంలో కూడా ఇది సులభతరం చేసిందని మంత్రి చెప్పారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ " భారత ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను పొందేందుకు స్టార్ట్ అప్‌లను సాంకేతికంగా మూల్యాంకనం చేయడం కోసం డిపిఐఐటీకి చెందిన ఇంటర్-మినిస్టీరియల్ బోర్డు (ఐఎంబి)కి ఎన్ఆర్‌డిసి సహాయం చేస్తుంది. ఇప్పటి వరకు 7500 కంటే ఎక్కువ స్టార్ట్-అప్‌ల దరఖాస్తులు అంచనా వేయబడ్డాయి." అని తెలిపారు.

స్టార్టప్‌లను గుర్తించడం నుండి ఉత్పత్తి ప్రారంభించడం వరకు తమ స్టార్టప్ స్కీమ్‌ను అమలు చేయడానికి ఎన్ఆర్‌డిసి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసిఎల్)తో కూడా అనుబంధం కలిగి ఉందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.

ఎగుమతి ఆధారిత వ్యవసాయ ఆధారిత స్టార్టప్‌లకు మార్గదర్శకత్వం మరియు పర్యవేక్షణ కోసం అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (అపెడా)తో ఎన్ఆర్‌డిసి అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు మంత్రి చెప్పారు.

టెక్నాలజీ డెవలప్‌మెంట్, ధ్రువీకరణ మరియు వాణిజ్యీకరణ కార్యక్రమం (టిడివిసి) అనేది భారతీయ సమాజం మరియు బ్రిక్ అండ్ మోర్టార్ తయారీ పరిశ్రమ ఆర్థిక వ్యవస్థ యొక్క సమస్యల ప్రకటనలపై దృష్టి సారించే స్టార్టప్‌లు, ఇంక్యుబేటీలు మరియు ఎంఎస్ఎంఈలకు ఆర్థిక సహాయాన్ని అందించడానికి గ్రాంట్-ఇన్-ఎయిడ్ స్కీమ్ అని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలియజేశారు.

వివిధ ఆర్‌డిసి వనరుల నుండి ఎన్ఆర్‌డిసి సంపాదించిన సాంకేతికతలు విలువ జోడింపు ద్వారా రూపాంతరం చెందుతాయని మరియు వాణిజ్యపరమైన అవసరాల కోసం పరిశ్రమలకు అందించబడుతున్నాయని డిఎస్ఐఆర్ కార్యదర్శి డాక్టర్.ఎన్.కలైసెల్వి డాక్టర్ జితేంద్ర సింగ్‌కు తెలియజేశారు. ఎన్ఆర్‌డిసి యొక్క ప్రధాన ఆదాయ ప్రవాహాన్ని ఏర్పరిచే పరిశీలన కోసం ఎన్ఆర్‌డిసి మరియు ఆర్‌డిఐ సంస్థ పరిశ్రమకు సాంకేతికత బదిలీని సులభతరం చేసిందని ఆమె అన్నారు.

ఎన్ఆర్‌డిసి ఛైర్మన్ ఢ మేనేజింగ్ డైరెక్టర్ కమోడోర్ అమిత్ రస్తోగి (రిటైర్డ్) ఎన్ఆర్‌డిసి రాష్ట్ర/కేంద్ర ప్రభుత్వ ఇంక్యుబేటర్లలో పొదిగిన అర్హత కలిగిన టెక్నాలజీ ఆధారిత స్టార్టప్‌లకు ఈక్విటీకి సీడ్ ఫండింగ్‌ను అందిస్తుందని తెలిపారు. స్టార్టప్‌లు బలమైన వాణిజ్య విలువతో వినూత్నమైన మరియు సాంకేతికతతో కూడిన అభివృద్ధిని ప్రదర్శించాలని సూచించారు.

జాతీయ మరియు అంతర్జాతీయ శాస్త్ర ఢ సాంకేతిక సంస్థలు, పరిశ్రమలు, పారిశ్రామిక సంఘాలు, రాష్ట్ర ఢ కేంద్ర ప్రభుత్వ శాఖలు, ఎస్‌టిపిలు మరియు ఇంక్యుబేటర్లతో విస్తృత అనుసంధానాల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసినందున జాతి నిర్మాణంలో ఎన్ఆర్‌డిసి ముఖ్యమైన పాత్రను పోషిస్తోంది.

దేశంలో స్టార్టప్‌ల పర్యావరణ వ్యవస్థకు మద్దతు ఇవ్వడానికి మరియు ప్రోత్సహించడానికి ఎన్ఆర్‌డిసి అనేక కార్యక్రమాలను చేపట్టింది. ఈ లక్ష్యంతో ఎన్ఆర్‌డిసి సాంకేతికతతో నడిచే స్టార్టప్‌లను వాణిజ్యపరమైన వెంచర్‌లుగా పరిపక్వతకు ప్రోత్సహించడానికి ఇంక్యుబేషన్ సెంటర్‌లను స్థాపించింది మరియు నిర్వహించడం ప్రారంభించింది.

ఎన్ఆర్‌డిసి ఇంక్యుబేషన్ సెంటర్: కార్పొరేషన్ ఎనిమిది స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేయడానికి ఒక భౌతిక మరియు వర్చువల్ స్థలాన్ని సృష్టించింది. వారంతా తయారీ పరిశ్రమ రంగంలో కొత్త పరిష్కారాలపై పని చేస్తున్నారు. ఈ స్టార్టప్‌లకు మెంటరింగ్ మరియు హ్యాండ్ హోల్డింగ్ సేవలు, వివిధ నెట్‌వర్క్ లాబొరేటరీలలో టెస్టింగ్ మరియు ఫ్యాబ్రికేషన్ కోసం సబ్సిడీ సౌకర్యాలు, ఈక్విటీకి నిధులు, ఇంక్యుబేషన్ సర్టిఫికేషన్, ఆఫీస్ మరియు కాన్ఫరెన్స్ సౌకర్యాలు మొదలైనవి అందించబడుతున్నాయి.

ఎజీఈఫ్త33.జీవతీనీ: మాక్33.ఎయిరో అనేది బెంగళూరులోని సిఎస్ఐఆర్-ఎన్ఏఎస్ బెంగళూరు క్యాంపస్‌లో ఫౌండేషన్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (ఎఫ్ఐఎస్ఈ) (టాటా ట్రస్ట్ మద్దతుతో ఒక చొరవ) సహకారంతో రూపొందించబడిన అత్యంత ప్రత్యేకమైన స్టార్టప్ ఇంక్యుబేషన్ సౌకర్యం.

ఇది డిసెంబర్ 2021లో స్థాపించబడింది మరియు ప్రారంభించబడింది. ఈ ఇంక్యుబేషన్ ఫాక్యాల్టి ఏరోస్పేస్ మరియు అనుబంధ పరిశ్రమల రంగాలలో స్టార్ట్ అప్‌ల పొదుపును ప్రోత్సహిస్తుంది.

ఇన్నోవేటివ్ టెక్నాలజీ ఎనేబుల్ సెంటర్ (ఇంటెక్): ఇంటెక్ అనేది భువనేశ్వర్‌లోని సిఎస్ఆర్ఐ-ఐఎంఎంటీ క్యాంపస్‌లో సృష్టించబడిన స్టార్టప్ ఇంక్యుబేషన్ సదుపాయం. ఇప్పుడు ఇది కార్పొరేషన్ ద్వారా నిర్వహించబడుతుంది. ఈ సదుపాయం మెటీరియల్స్, మైనింగ్ మరియు అనుబంధ పరిశ్రమల రంగాలలో పని చేస్తున్న స్టార్టప్‌ల ఇంక్యుబేషన్‌ను ప్రోత్సహించడానికి ఉద్దేశించబడింది.

# దుబ్బాక బస్ స్టాండ్ ను ప్రారంభించిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

ఖమ్మం, డిసెంబర్ 30 (నేటినిజం ప్రతినిధి): సిద్దిపేట జిల్లా దుబ్బాకలో గత ఉప ఎన్నికల హామీ మేరకు శిథిలావస్థలో ఉన్న బస్టాండ్‌ను తొలిగించి, రూ.3.50కోట్లతో సర్వాంగ సుందరంగా మోడల్ బస్టాండ్ ను రాష్ట్ర ప్రభుత్వం నిర్మించింది.



శుక్రవారం ఆధునిక ఆర్టీసీ బస్ స్టాండ్ ను మంత్రులు హరీష్ రావు, నిరంజన్ రెడ్డిలతో కలిసి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం దుబ్బాక నియోజకవర్గ పరిధిలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రులు శ్రీకారం చుట్టారు.

# చుక్క నీళ్లు దొరకని ప్రాంతంలో సముద్రాన్ని సృష్టించాడు కేసీఆర్ : మంత్రి నిరంజన్ రెడ్డి



సిద్దిపేట, డిసెంబర్ 30 చుక్క నీళ్లు దొరకని దుబ్బాక ప్రాంతంలో సీఎం కేసీఆర్ సముద్రాన్ని సృష్టించారు అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో ఒకప్పుడు నీళ్లు దొరకని పరిస్థితి.. ఇప్పుడు ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామని పేర్కొన్నారు. దుబ్బాక పట్టణంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారంలో మంత్రి నిరంజన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు.

దుబ్బాకలో గతంలో జరిగిన పొరపాటు మళ్ళీ జరగకుండా ఇక్కడి ప్రజలు చూడాలి అని కోరారు. నిన్న ఓ బీజేపీ నాయకుడు మాట్లాడుతూ, తెలంగాణలో 90 స్థానాలు గెలుస్తామని అన్నాడు. మొదటగా 90 మంది అభ్యర్థులను పెట్టుకోవాలని సూచించారు. 18 రాష్ట్రాల్లో అధికారంలో ఉండి ఎక్కడైనా ఒక్క ప్రాజెక్ట్ కట్టారా? అని నిలదీశారు. మీరు ప్రాజెక్టులు కట్టరు, మేము కడితే అడ్డుపడుతున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికష్టాలు వచ్చిన రైతు బంధు ఆపలేదు అని స్పష్టం చేశారు. 10వ విడతలో ఇప్పటికే 42 లక్షల ఎకరాలకు రైతుబంధు వచ్చిందన్నారు. సీఎం కేసీఆర్‌కు మనందరం అండగా నిలవాలని నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# నూతన సంవత్సర వేడుకలు సజావుగా జరుపుకోవాలి: సిపి



ఖమ్మం, డిసెంబర్ 30 (నేటినిజం ప్రతినిధి): నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ నిర్వహించుకునే సంబరాలు ఇతరుల్ని ఇబ్బంది పెట్టే విధంగా ఉండకూడదని పోలీసు కమిషనర్ విష్ణు యస్. వారియర్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ నూతన సంవత్సర వేడుకలు సజావుగా జరుపుకునే విధంగా పోలీసులకు సహకారించాలి సూచించారు.

జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన పోలీసు బందోబస్తు, అన్ని ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్, విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామని, ఎవరైన మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులు నమోదు చేయాలని అధికారులకు ఆదేశించినట్లు పోలీస్ కమిషనర్ చెప్పారు. సంతోషకరమైన వాతావరణంలో జరుపుకునే నూతన సంవత్సర వేడుకలలో మితిమీరిన వేగంతో డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాల బారీన పడి మీ కుటుంబాలలో విషాదం నింపే పరిస్థితి తీసుకొని రాకుండా ప్రతి పౌరుడు భాద్యతగా వేడుకలు జరుపుకొవాలని సూచించారు. డిసెంబర్ 31వ తేదీ రాత్రి నిర్ణీత సమయంలోనే మద్యం దుకాణాలు, డాబాలు, బార్లు, రెస్టారెంట్లు, హోటల్‌లు మూసివేయాలన్నారు. ప్రధాన కూడళ్ళలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. వాహన చోదకులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని, ర్యాలీలు, బాణసంచా పేలుడు నిషిద్ధమని తెలిపారు. హై స్పీడ్ నియంత్రణకు బారీగేట్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. త్రిబుల్ రైడింగ్, మైనర్లు రైడింగ్‌పై కూడా ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేయాలని, మద్యం మత్తులో ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తులకు నష్టం చేకూర్చినా అటువంటి వారి పట్ల కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## - న్యూ ఇయర్ వేడుకలకు మార్గదర్శకాలివే...

తాత్కాలిక వినోద లైసెన్స్ మంజూరు కోసం పోలీస్ కమిషనర్ కార్యాలయానికి దరఖాస్తుదారుడు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలిబహిరంగ వేడుకల్లో డీజేకు అనుమతి లేదు

ధ్వని కాలుష్యంపై ఫిర్యాదు వస్తే చట్టపరమైన చర్యలు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన, మద్యం సేవించి వాహనం నడిపిన జైలు, జరిమానా అసభ్యకర దుస్తులు ధరించినా.. నృత్యాలు చేసినా చర్యలు వేడుకల్లో మాదక ద్రవ్యాలకు అనుమతిస్తే చర్యలు ట్రిపుల్ రైడింగ్, వాహనాల సైలెన్సర్ లను తీసివేసి శబ్ద కాలుష్యం చేస్తూ రోడ్లపై అతివేగంగా నడుపుతూ ఇబ్బంది పెడితే కేసులు నమోదు చేయడం, వాహనాలు సీజ్ చేయడం జరుగుతుంది. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారికి వాహనాలు ఇచ్చిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. వేదికలోకి ప్రవేశించే వ్యక్తులను స్కాన్ చేయడానికి ఎంట్రీ పాయింట్ వద్ద ఐఆర్ థర్మామీటర్లు/థర్మల్ స్కానర్‌లను ఏర్పాటు చేయాలి. భద్రత దృష్ట్యా వేడుకలకు సామర్థ్యానికి మించి పాస్‌లు/టికెట్లు/విక్రయించడం చేయరాదు.

అన్ని ప్రవేశ, నిష్క్రమణ, పార్కింగ్ ప్రదేశాల వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు జారీ చేసే సూచనలను పాటించాలి. అన్ని వాహనాల పార్కింగ్ ఉండేలా చూడాలి. ప్రధాన రహదారిపై పార్కింగ్ అనుమతించకూడదు. లైసెన్సుదారుడు తగిన సంఖ్యలో సెక్యూరిటీ గార్డులను నియమించాలి. క్రమబద్ధమైన పార్కింగ్ గురించి సరైన భద్రతా చర్యలు తీసుకోవాలి. నిర్వహించబడుతున్న ప్రోగ్రామ్‌కు కొనసాగింపుగా ఏదైనా నష్టం/ఉపద్రవం మొదలైన వాటి బాధ్యత పూర్తిగా లైసెన్స్‌దారుని మాత్రమే కలిగి ఉంటుంది. ప్రజలకు ప్రమాదం లేదా నష్టాన్ని కలిగించే ప్రమాదకరమైన ప్రదర్శన లేదా ప్రదర్శన ఉండకూడదు.

# మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన రిటైర్డ్ ఉద్యోగులు



మహబూబ్‌నగర్, డిసెంబర్ 30 మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు రాష్ట్ర ఆబ్కారీ, క్రీడల అభివృద్ధి శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్‌లో చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో పరుగులు పెడుతుందని అన్నారు.

ఫ్రెండ్లీ గవర్నమెంట్‌గా ఉంటూ ప్రభుత్వ, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను తెలంగాణ ప్రభుత్వం ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తుందని అన్నారు. దేశంలోని ఏ రాష్ట్రాల్లో జరగని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తెలంగాణలో జరుగుతున్నాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో రాఘవరెడ్డి, అచ్చిరెడ్డి, సిరాజుద్దీన్, అంజిరెడ్డి, చిన్నయ్య, వెంకటస్వామి యాదవ్, అయూబ్, చంద్రయ్య గౌడ్ సహా మరికొంత మంది బీఆర్ఎస్ చేరిన సందర్భంగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ కృష్ణయ్య గౌడ్, కౌన్సిలర్ అనంతరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు పిల్లి సురేష్, జిల్లా గ్రంథాలయ సభ్యురాలు అనిత తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో పదవ తరగతిలో వంద శాతం ఫలితాల సాధనకు యజ్ఞంలా పనిచేయాలి..... !- జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్.



సంగారెడ్డి, డిసెంబర్ 30 (నేటి నిజం ప్రతినిధి)జిల్లాలో పదవ తరగతిలో వంద శాతం ఫలితాల సాధనకు యజ్ఞంలా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులను కోరారు.

శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల జిల్లా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి భవిష్యత్తుకు పదవ తరగతి పునాది లాంటి దన్నారు. మన సొంత బిడ్డల భవిష్యత్తు గురించి ఎలా ఆలోచిస్తామో అదేవిధంగా విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆలోచించాలన్నారు.

రానున్న పదవ తరగతి పరీక్షలలో జిల్లాలో వంద శాతం రిజల్ట్స్ రావాలంటే అందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. పదవ తరగతి ఫలితాలలో రాష్ట్రంలో జిల్లాను అగ్రస్థానంలో నిలపడంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, అందరూ భాగస్వాములు కావాలన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల ఎజెండాతో అన్ని సబ్జెక్టులలో అత్యుత్తమ రిజల్ట్ సాధించేలా సిద్ధం చేయాలని సూచించారు.

ప్రత్యేక తరగతుల నిర్వహణ సాధారణమే అన్నట్టుగా కాకుండా ,ఉపాధ్యాయులు విద్యార్థులు చురుకుగా పాల్గొనాలన్నారు. సబ్జెక్టు టీచర్లకు కమిట్మెంట్ ఉండాలన్నారు. అప్పుడే అనుకున్న ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు.

అందరూ నిబద్ధతతో బాధ్యతగా పనిచేస్తే జిల్లా పదవ తరగతి ఫలితాలలో మొదటి స్థానంలో నిలుస్తుందన్నారు.

వంద శాతం రిజల్ట్స్ కోసం చేపట్ట నున్న కార్యాచరణ ప్రణాళికను ఉపాధ్యాయ యూనియన్ల ప్రతినిధులకు వివరించారు.

కాంటెంట్ డెవలప్మెంట్ కు సంబంధించి హార్డ్ ,సాఫ్ట్ కాపీలను సబ్జెక్టు టీచర్లకు ఇస్తామన్నారు. మండల స్థాయిలో ఎక్స్ పర్ట్ టీం లను తయారు చేస్తున్నామన్నారు. సబ్జెక్టు టీచర్లకు ఓరియంటేషన్ ఇస్తారని తెలిపారు.

విద్యార్థుల తల్లిదండ్రుల కు పరీక్షల ప్రాధాన్యత, హాజరు తదితర విషయాలను వివరించాలని, వారి సహకారంతో అనుకున్న ఫలితాలు లభిస్తాయన్నారు. తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లు తీసుకుని ఎప్పటికప్పుడు విద్యార్థి చదువు విషయమై కనుక్కోవాలన్నారు.

ప్రత్యేక తరగతులు జరుగుతున్నపుడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వారానికి మూడు రోజులు విధిగా ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థులు రెగ్యులర్గా ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా చూడాలన్నారు. టెస్టులకు సంబంధించిన మార్కుల జాబితాను ఎప్పటికప్పుడు ఎంఈఓ కార్యాలయానికి పంపాలన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సూచించారు.

## పదవ తరగతి పరీక్షల వరకు

అవసరమున్న చోట సబ్జెక్టు టీచర్ల ను ఎవరినైనా తీసుకోవడానికి హెడ్ మాస్టర్ల కు అనుమతినిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రతి పాఠశాలకు ఒక ప్రత్యేక అధికారిని కేటాయిస్తున్నామని, అవసరమైన సహకారాన్ని ఎపరీక్షలు పూర్తయ్యే వరకు

పిల్లలకు స్నాక్స్ ఇవ్వడానికి పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. అందరి భాగస్వామ్యంతో టీం గా పనిచేయాలని సూచించారు.

అనంతరం పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ యాక్షన్ ప్లాన్ మేరకు పని చేస్తామని, జిల్లాకు మంచి ఫలితాలు తీసుకువస్తామని కలెక్టర్కు హామీ ఇచ్చారు.

ఇచ్చే స్టడీ మెటీరియల్ ఇన్ టైం లో ఇవ్వాలని కోరారు. సబ్జెక్టు టీచర్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకుల సమిష్టి కృషితో పదవ తరగతిలో వంద శాతం రిజల్ట్స్ తీసుకువస్తామని తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజార్షి షా, జిల్లా విద్యాధికారి నాంపల్లి రాజేష్,వివిధ ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట జిల్లాలో దారుణం : యువకుడి దాడి.. వృద్ధుడి మృతి..

సిద్దిపేట,డిసెంబర్ 30 సిద్దిపేట జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. జగదేవ్ పూర్ మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన తొవరి యాదగిరి పై గురువారం రాత్రి అదే గ్రామానికి చెందిన యువకుడు దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయాల పాలైన యాదగిరి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గజ్వేల్ హాస్పిటల్ కి తరలించారు. దాడికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.

# నూతన వేడుకల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు

## – శ్రుతి మించే చర్యలకు పాల్పడిన వారిపై చట్టమైన చర్యలు

## –రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే




రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 30 (నేటినిజం ప్రతినిధి): జిల్లాలోని ప్రజలు డిసెంబర్ 31 వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేకంగా టీమ్‌లను ఏర్పాటు చేసి డిసెంబర్ 31 రోజు సాయంత్రం నుంచి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మైనర్లకు వాహనాలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే యువత సైలెన్సర్లను తీసి నడపడం, త్రిబుల్ రైడింగ్ వంటివి చేస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. గుంపులు గుంపులుగా రోడ్లపై కేకలు వేస్తూ తిరగడం, వాహనాలతో ర్యాలీగా వెళ్లడం చేయొద్దన్నారు. డీజేలు నిషేధించామని, ఎక్కడైనా అలా చేస్తే డీజేలు సిజ్ చేస్తామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశంలో మద్యం తాగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ శాఖ తీసుకునే ముందస్తు రక్షణ చర్యలకు ప్రజలు,సంపూర్ణమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు.

# భక్తులతో సంయమనం, సహనంతో వ్యవహరించాలి: టీటీడీ జేఈవో

తిరుపతి, డిసెంబర్ 30తిరుమలలో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులతో సంయమనం, సహనంతో వ్యవహరించాలని టీటీడీ జేఈవో సదా భార్గవి ఉద్యోగులకు సూచించారు. తిరుమల శ్రీవారి ఆలయంలో జనవరి 2 నుంచి 11వ తేదీ వరకు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించాలని టీటీడీ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులోభాగంగా తిరుపతి లోని 9 ప్రాంతాల్లో సుమారుగా 100 కౌంటర్ల ద్వారా సర్వదర్శనం టోకెన్లు జారీ చేయడానికి ఏర్పాట్లు సిద్ధం అవుతున్నాయి.

సర్వదర్శనం టోకెన్ల జారీ కౌంటర్లలో విధులకు నియమించిన సిబ్బందికి శుక్రవారం శ్వేత భవనంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఈవో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ కౌంటర్లల్లో విధుల్లో ఉన్న సిబ్బంది యాత్రికులతో మాట్లాడకుండా వేగంగా టోకెన్లు జారీ చేయాలని చెప్పారు. ఇందులో ఏమైనా సమస్యలు తలెత్తితే ఆయా కేంద్రాల ఇన్‌చార్జిగా ఉన్న సీనియర్ అధికారి దృష్టికి తేవాలన్నారు. రిలీవర్ వచ్చే వరకు కౌంటర్ నుంచి వెళ్లరాదని ఆమె సూచించారు.

ఆధార్ మాత్రమే గుర్తింపు కార్డుగా తీసుకుని టోకెన్లు జారీ చేయాలన్నారు. ఉద్యోగులకు కౌంటర్ల వద్దకే టిఫిన్, తాగునీరు, కాఫీ,టీ, స్నాక్స్ ఏర్పాటు చేశామన్నారు. శనివారం ఉద్యోగులకు సూచించిన సమయానికి 15 నిముషాల ముందే తమకేంద్రాల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని జేఈవో వివరించారు. 10 రోజుల టోకెన్ల కోటా పూర్తయ్యే వరకు నిరంతరాయంగా జనవరి 1వ నుంచి టోకెన్లు జారీ చేస్తామన్నారు.

క్యూలైన్ల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశామని, వారికి అన్న ప్రసాదాలు, టిఫిన్, కాఫీ,పాలు, తాగునీరు అందించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

# నూతన సంవత్సరం వేడుకల్లో శృతి మించొద్దు -పోలీస్ కమిషనర్ వి. సత్యనారాయణ



కరీంనగర్, డిసెంబర్ 30 (నేటినిజం ప్రతినిధి): నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పగడ్బంది చర్యలు తీసుకుంటున్నామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ అన్నారు. అన్ని వర్గాల ప్రజలు నూతన సంవత్సరం వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని చెప్పారు.

### శనివారం ఉదయం నుండి ఆదివారం ఉదయం వరకు తనిఖీలు

శ్రుతిమించే చర్యలకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. శనివారం రాత్రి నుండి బ్రీత్ అనలైజర్లతో డ్రంకెన్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కమిషనరేట్ వ్యాప్తంగా నియమనిబంధనలు ఉల్లంఘించేవారిపై చర్యలు తీసుకోవడంతోపాటు ప్రత్యేకంగా డ్రంకెన్ డ్రైవ్ నిర్వాహణకు ప్రత్యేక మొబైల్ బృందాలను ఏర్పాటు చేసి రేయింబవళ్ళు తనిఖీలను ।కొనసాగించనున్నామని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తప్పవని । హెచ్చరించారు. వాహనాల సైలెన్సర్లు తొలగించి శబ్దకాలుష్యం కలిగించడం పూర్తిగా నిషిద్ధమని స్పష్టం చేస్తున్నాము. డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగంగా, నిర్లక్ష్యంగా, ముగ్గురు అంతకంటే ఎక్కువ మందితో ద్విచక్ర వాహనాల పై వెళ్ళే వారి వాహనాలను సీజ్ చేయడం, విధించబడిన ఈ చలాన్లు చెల్లించకుండా సంచరించే వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు.

### మైనర్లకు వాహనాలిచ్చే వాహనదారులపై కేసుల నమోదు చేస్తాం

మైనర్లకు వాహనాలిచ్చే వాహనదారులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. రోడ్డునియమ నిబంధనల్లో భాగంగా మైనర్లకు వాహనాలిచ్చే వాహనదారులపై కేసులు నమోదు చేయడంతోపాటు సదరు మైనర్ల తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్లకు పిలిచి కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### కమిషనరేట్ వ్యాప్తంగా కదలికలపై సిసి కెమెరాలతో నిఘా

నూతన సంవత్సరం వేడుకలను చిత్రీకరించేందుకు నగరంలో ఇప్పటికే ఉన్న వేలాది సిసి కెమెరాలతోపాటు అదనంగా సిసి కెమెరాలను ఏర్పాటు చేయనున్నామని కమిషనరేట్ పరిధిలో 50 వీడియో చిత్రీకరణ బృందాలు, డ్రోన్ కెమెరాలను రంగంలోకి దించనున్నాము.

నిర్లక్ష్యంగా వాహనాలు నడిపే వారితోపాటు రోడ్డు నియమ నిబంధనలు పాటించని వాహనచోదకుల వాహనాలను సీజ్ చేయడం జరుగుతుంది. రోడ్ల పైన కత్తులు, తల్వార్లతో కేకలు కట్చేయడం, రోడ్లపై సౌండ్బిస్టమ్లతో నృత్యాలు చేయడం,రంగులు చల్లుకుంటూ రోడ్లపై వెళ్ళే ఇతరులకు ఇబ్బంది కలిగించడం వంటివి చేసే వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

### కేసులపాలై జీవితాలను వృథాచేసుకోవద్దు

విచ్చలవిడిగా రోడ్ల పైకి వచ్చి ర్యాలీలుగా వెళ్ళడం, అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడుపడం, ప్లేట్ ట్యాంపరింగ్ లాంటి చర్యలకు పాల్పడే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఒకసారి కేసునమోదై పోలీస్ రికార్డుల్లోకి ఎక్కితే యువత ఉన్నత చదువులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించవని, అనవసరంగా నియమనిబంధనలు విస్మరించి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. తల్లిదండ్రుల ఆశయాల సాధనకోసం క్రమశిక్షణతో ముందుకుసాగితేనే జీవితంలో సఫలీకృతం అవుతామనే విషయాన్ని యువత గుర్తించాలని చెప్పారు. గతంలో పోలీసు కేసులు నమోదైన వారు ఇప్పుడు ఎక్కడా ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లభించక దుర్భరస్థితిలో కొనసాగుతున్నారని తెలిపారు.

### పొంచిఉన్న కోవిడ్ ప్రాణాంతకం

ప్రాణాంతకమైన కోవిడ్ వ్యాప్తి పొంచిఉన్నందున ప్రజలందరూ స్వీయనియంత్రణ పాటించడంతోపాటు, వైద్యుల సలహాలు,సూచనలు పాటించాలని కోరుతున్నాము. జనసమూహంతో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించినా ప్రాణాంతకమైన కోవిడ్ బారినపడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆరోగ్యాన్ని పరిరక్షించుకునే చర్యలను పాటించడం తమభాధ్యతగా అన్నివర్గాల ప్రజలు గుర్తించాలని చెప్పారు. ఆదివారం తెల్లవారుజాము వరకు ప్రత్యేక తనిఖీలు కొనసాగనున్నాయి.

### షీ బృందాలతో గస్తీ ఏర్పాటు

మహిళలు, యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోకిరీలపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు కంటికి కనిపించని రీతిలో ఉండే అత్యాధునిక సాంకేతిక పరికరాలను వినియోగిస్తున్నామని, ఇందులో నిక్షిప్తమైన దృశ్యాలను సాక్ష్యాధారాలుగా న్యాయస్థానాల్లో ప్రవేశపెట్టి పోకిరీలను శిక్షలు విధించబడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. షీటీం బృందాలు కూడా మఫ్టీలో సంచరించనున్నాయి. నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా విధుల్లో ఉన్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు తమవంతు సహకారం అందజేయాలని కోరారు.

### 31 రాత్రి నుండి నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా శనివారం రాత్రి నుండి జనవరి 01వ తేది ఉదయం 6గంటల వరకు కరీంనగర్ లో ట్రాఫిక్ ఆంక్షలు, దారి మళ్ళింపు చర్యలు కొనసాగనున్నాయి. 31న రాత్రి 8గంటల నుండి ఉదయం 6గంటల వరకు భారీ వాహనాలను నగరంలోకి అనుమతించబోమని తెలిపారు.

# అపజయాలకు ఆగిపోవద్దు అఖండమైన ధైర్యంతో ప్రయత్నించాలి



–కరీంనగర్, డిసెంబర్ 30 (నేటినిజం ప్రతినిధి): స్టూడెంట్స్ సూసైడ్స్ అండ్ క్రైమ్స్ ఎరాడికేషన్ సొసైటీ× (జెజెఎస్ ) జగిత్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కాకతీయ జూనియర్ కాలేజీ లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.విద్యార్థుల ఆత్మహత్యలు నేరాల నిర్మూలన, స్టడీ స్కిల్స్×అనే అంశాలపై అవగాహన కల్పించారు,ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మర్రిపెల్లి శ్రీనివాస్ వక్తలు కొలగాని నరేశ్, వావిలాల పవన్ లు మాట్లాడుతూవిద్యార్థులు ఆశావహ దృక్పథంతో నిరంతరం కష్టపడి ముందుకు వెళ్లాలని సూచించారు, జీవితంలో గెలుపు ఓటములు సహజమని తెలిపారు ,అదేవిధంగా పట్టుదలతో ప్రయత్నించి సాధించాలని తల్లిదండ్రులకు దేశానికి పేరు తీసుకురావాలని సూచించారు,ఈ కార్యక్రమంలోజె జె ఎస్ జిల్లా అధ్యక్షుడు మర్రిపెల్లి శ్రీనివాస్, కాకతీయ కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్యామల,జిల్లా ప్రధాన కార్యదర్శి కార్యదర్శి డా. శ్రీపాద నాగేంద్ర శర్మ,సలహా దారులు,వక్తలు కొలగాని నరేశ్, వావిలాల పవన్,అధ్యాపకులుఎర్రోజు విశ్వంభర చారి,సహాయ కార్యదర్శి టేకుమల్ల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఒకినావా కరాటే స్కూల్ ఆధ్వర్యంలో అల్ఫోర్స్

## –విద్యార్థులకు కరాటే బెల్టుల ప్రధానం





కరీంనగర్, డిసెంబర్ 30 (నేటినిజం ప్రతినిధి): విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల పట్ల అవగాహన కల్పించాలని అందులో పాల్గొనేలా ప్రోత్సాహకాలను అందించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా? వి. నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో ఒకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బెల్టుల ప్రధానోత్సవ కార్యక్రమానికి వివిఎన్ఆర్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలలో ఎన్నో విషయాలు నేర్చుకునేవి ఉంటాయని ప్రత్యేకంగా విజయాలను సాధించే విధానాలను తెలుసుకోవాలని తెలిపారు. క్రీడల్లో లభించే లాభాలు ఇతర అంశాల్లో విజయం సాధ్యం చేసేవిధంగా ఉంటాయని చెప్పారు. విద్యార్థులకు పోటీతత్వంతో పాటు సత్సంబంధాలు ఏర్పరిచే విధంగా ఉంటాయని తెలుపుతూ ప్రతి విద్యార్థి క్రీడా రంగాల్లో పాల్గొని వాటిలోని విషయాలను సముచితంగా తెలుసు కొని ఉత్తమంగా ఉండాలని సూచిం చారు.ప్రాథమికంగా విద్యార్థులకు పాఠశాలలో ఎంపిక పరీక్ష నిర్వహిస్తామని అందులో ప్రతిభను కనబరచిన వారికి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఈ క్రమంలో నేడు పాఠశాలలో నిర్వహింపబడిన కరాటే బెల్టుల ప్రధానోత్సవం కార్యక్రమంలో 45 మంది విద్యార్థులకు యల్లో బెల్టు, 20 మంది కి ఆరెంజ్ బెల్టు, 5 గురు విద్యార్థులకు గ్రీన్ బెల్ట్ 2 విద్యార్థులకు బ్రౌన్ బెల్టులు ప్రదానం చేయడం జరిగినదని వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు విన్యాసాలు ఆకర్షించాయి. ఉత్సాహాన్ని నింపాయి. అదే విధంగా విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొదిస్తూన్న శిక్షకులకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కరాటే ఇన్స్ట్రక్టర్ కె. వసంత్ కుమార్ , శిక్షణ సిబ్బంది, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, తల్లితండ్రులు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సమిష్టి కృషితో.... మహా శివరాత్రి జాతరను విజయవంతం చేద్దాం -గతం కంటే మెరుగ్గా

# మహా శివరాత్రికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## – జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 30 (నేటినిజం ప్రతినిధి): దక్షిణకాశీగా పేరుగాంచిన వేములవాడలో జరిగే మహా శివరాత్రి పర్వదిన వేడుకల్లో ఎక్కడా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు.

ప్లానింగ్ పకడ్బందీ ఉంటేనే ఈవెంట్ మేనేజ్మెంట్ సులభం అవుతుందని చెప్పారు.

గతం కంటే భక్తులు అధికంగా వచ్చే ఆస్కారం ఉన్న దృష్ట్యా భక్తులకు గతం కంటే మెరుగ్గామహా శివరాత్రికి పకడ్బందీ ఏర్పాట్లుచేయాల న్నారు సమిష్టి కృషితో మహా శివరాత్రి జాతరను సక్సెస్ చేద్దామని అధికారులతో జిల్లా కలెక్టర్ అన్నారు.వేములవాడ లో ఫిబ్రవరి 17వ తేదీ నుంచి 19 వ తేదీ వరకు మహా శివరాత్రి జాతర జరగనున్న నేపథ్యంలో జాతర ఏర్పాట్ల పై శుక్రవారం వేములవాడ ఆలయంలోని ఓపెన్ స్లాబ్‌లో వివిధశాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ అనురాగ్ జయంతి సమన్వయ సమావేశం నిర్వహించారు.

జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే, జిల్లా అదనపు కలెక్టర్ లు బి సత్య ప్రసాద్, ఎన్ ఖీమ్యా నాయక్, ఆలయ కార్యనిర్వహణాధికారి కృష్ణ ప్రసాద్ లు పాల్గొన్నారు.

జాతరలో ట్రాన్స్పోర్ట్, పార్కింగ్, రోడ్ల మరమ్మతులు, అకామిడేషన్, త్రాగునీరు, విద్యుత్ సరఫరా, బందోబస్తు, పార్కింగ్, ఆరోగ్యం పారిశుద్యం, క్రౌడ్, ఖీ లైన్ మేనేజ్మెంట్, , పబ్లిక్ అడ్రెస్స్ సిస్టం ఏర్పాటు, శివార్చన కార్యక్రమం, సూచికల ఏర్పాటు, ప్రచారం, అనుబంధ ఆలయాల్లో ఏర్పాట్లు తదితర అంశాలపై ఆయా శాఖల అధికారుల కార్యాచరణ ప్రణాళిక ను సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు .

ప్రతి శాఖ క్షేత్ర స్థాయిలో అమలు చేసే సమగ్ర కార్యాచరణ ను సిద్ధం చేసుకుని వచ్చే సమావేశంలో వివరించాలని చెప్పారు. పారిశుద్యం ప్రాధాన్యతను గుర్తించి మ్యాన్ పవర్, వాహనాలను పెంచుకోవాలని చెప్పారు. మరిన్ని ఎక్కువగా టాయిలెట్ , డ్రెస్ చేంజింగ్ సెంటర్ లను ఏర్పాటు చేసి సిబ్బందిని నిరంతరం ఉండేలా చూసుకోవాలని చెప్పారు. త్రాగునీరు , శానిటేషన్, టాయిలెట్ ప్లాను, స్టాఫ్ ప్లాన్ , మెటీరియల్ ప్లాన్ లను ఆయా శాఖల అధికారులు సిద్ధం చేసి స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ కుఅందజేయాలన్నారు.

ఆర్టీసీ అధికారులు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని బస్సులు నడుపాలని, యాత్రీకుల రద్దీ ఎక్కువగా ఉండే రూట్లలో అదనపు బస్ సర్వీసులు నడుపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

జనసమ్మర్ధక ప్రదేశాలలో మై హెల్ప్ యు డెస్క్ లు, శుద్ధ జల కేంద్రాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. టెంపుల్ కి వచ్చే రోడ్లనే కాకుండా పట్టణంలోని అన్ని ప్రధాన రోడ్ల ను పరిశీలించి అవసరమున్న చోట మరమ్మతులను వెంటనే చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. టాయిలెట్లకు , డ్రస్ చేంజింగ్ రూమ్ లకు క్వాలిటీ మెటీరియల్ వాడాలన్నారు .

ప్రతి చోట పెద్దగా కనిపించేలా సూచికల ఏర్పాటు చేయాలన్నారు. ఆలయం గెస్ట్ హౌస్ లకు , అకామిడేషన్ గదులకు పెయింటింగ్ వేయించాలన్నారు.

టెంపుల్ తో పాటు అన్ని ముఖ్య ప్రదేశాలను ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టి పడేలా విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించాలన్నారు.

ఆయాశాఖల అధికారులు వారికి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ...

ఫిబ్రవరిలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు పెద్ద సంఖ్యలో భక్తుల హాజరై అవకాశమున్నదృష్ట అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు ప్రధానంగా పారిశుధ్యం, పార్కింగ్, క్యూ లైన్ , త్రాగునీరు సరఫరా మేనేజ్మెంట్ ప్రత్యేక దృష్టి పెట్టామని చెప్పారు. వచ్చే సమావేశంలో అన్ని ప్రభుత్వ శాఖలు తమకు అప్పగించిన బాధ్యతలు, చేయబోయే కార్యాచరణ ను వివరిస్తూ సూక్ష్మ సమగ్ర కార్యాచరణ ప్రణాళికను తేవాలని ఆదేశించామని జిల్లా కలెక్టర్ తెలిపారు. శివరాత్రి జాతర ప్రాథమిక సమాచారం లభించేలా భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఆప్, డైరెక్టరీ నీ రూపొందించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూశివరాత్రి జాతరకు జిల్లా నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా అదన బందోబస్తును తేలునట్లు తెలిపారు.

భక్తులకు ట్రాఫిక్, పార్కింగ్ ఇబ్బందులు తలెత్తకుండ ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.

ట్రాఫిక్ , పార్కింగ్, క్యూ లైన్, ధర్మగుండం కంట్రోల్ రూమ్, బ్యారికేడింగ్ మేనేజ్మెంట్ ను పకడ్బందీ గా చేస్తామని చెప్పారు.

గతం కంటే అధికంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా నేత్రలతో జాతరను పర్యవేక్షణ చేస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పర్యవేక్షణ చేస్తామని తెలిపారు.సమావేశంలో వేములవాడ ఆర్డీఓ పవన్‌కుమార్, వేములవాడ డీవీస్పీ నాగేంద్ర చారి,జిల్లా రవాణా అధికారి కొండల్ రావు, డీపీవో రవీందర్, ప్యాకే జీ -9 కార్య నిర్వాహక ఇంజనీరు శ్రీనివాస్ రెడ్డి, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు .సమావేశం అనంతరం× జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

జిల్లా అదనపు కలెక్టర్ లు బి సత్య ప్రసాద్, ఎన్ ఖీమ్యా నాయక్ లు శ్రీ రాజ రాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు.ఆలయ పూజారులు వారికి స్వామి వారి ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

# లక్ష్మి అపరేషనుకు 10వేల ఆర్థికసాయం

## -డీ.ఎస్.పి కె.నాగేంద్రాచారి

### చేతులమీదుగా చెక్కు అందజేత

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 30 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ మండలం శాత్రాజుపల్లి గ్రామానికి చెందిన బద్దెపూరి లక్ష్మి గత ఆదివారం బైకు నుండి క్రిందపడడంతో తలకు తీవ్రగాయాలు కావడంతో హుటాహుటిన యశోద హాస్పిటల్ హైదరాబాద్ తీసుకెళ్లడంతో అక్కడి డాక్టర్లు అపరేషనుకు 8 లక్షల వరకు ఖర్చు అవుతుంది అని చెప్పడంతో నిరుపేద కుటుంబానికి చెందిన లక్ష్మి కుటుంబ సభ్యులు ఏమిచేయాలో తోచని పరిస్థితుల్లో లక్ష్మి కుమారుడు బద్దెపూరి రాకేషుకు వారి స్నేహితులు మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు వారిని సంప్రదిస్తే వారు కొంత ఆర్థిక సహాయం అందిస్తారని తెలపడంతో ట్రస్టు సభ్యులను సంప్రదించగా మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు గ్రూపులలో పోస్టు చేయగా దాతల ద్వారా విరాళాల రూపంలో 10వేలు రాగా ఇట్టి రూపాయలు శనివారం రోజున డీ.ఎస్.పి. కె.నాగేంద్రాచారి చేతులమీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది.

ఇట్టి కార్యక్రమంలో మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు సభ్యులు మధు మహేష్, గొంగళ్ళ రవికుమార్, డాక్టర్ .బెజ్జంకి రవీందర్, తోట రాజు, జూలపెల్లి రాజు, గొండ ప్రసాద్, మారం కుమార్ తదితరులు పాల్గొన్నారు

# బండపల్లిలో సివిల్ రైట్స్ డే




రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 30 (నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ తాసిల్దార్ గోపాల్ మాట్లా డుతూ గ్రామాల్లోని అంటరానితనాన్ని నిర్మూలించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సర్పంచి న్యాత విజయ జార్జి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామాల్లో సివిల్ రైట్స్ డే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవిఉప సర్పంచి గడ్డం శ్రీనివాస్ రెడ్డి. దళిత సంఘం నాయకులుగ్రామ ప్రజలుపాల్గొన్నారు,

# అవార్డుల ప్రదానోత్సవానికి హాజరైన డాక్టర్ గోలి మోహన్



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 30 (నేటినిజం ప్రతినిధి): హైదరాబాదు టీహబ్ లో జరిగిన కల రాజ్ మీడియా ఎంటర్టైన్మెంట్ 5వ వార్షికోత్సవ షార్ట్ ఫిలిం అవార్డ్స్ కి ప్రముఖ ఎన్నారై డాక్టర్ గోలి మోహన్ హాజరయ్యారు. ఈసందర్భంగా డాక్టర్ గోలి మోహన్ మాట్లాడుతూ యువత యూట్యూబ్లో మంచి సాంగ్స్ పాడుతూ మంచి మెసేజ్ ను ఇస్తు అందరిని అలరిస్తూ షార్ట్ ఫిలిమ్స్ తీస్తూ యువత తమ టాలెంట్ ని ప్రదర్శిస్తు ముందుకు వెళ్లడం అభినందనీయమన్నారు. కల రాజ్ మీడియా అందిస్తున్న అవార్డులు గెలుచుకున్న యూట్యూబ్ నిర్వహకులు రానున్న రోజుల్లో మరింత ముందుకు వెళ్లాలని..భవిష్యత్ లో మరిన్ని అవార్డులు గెలుచుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సినిమా అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ యాక్టర్ రాజేంద్రప్రసాద్, ప్రముఖ పాటలు రచయిత చంద్రబోస్, కవి అందెశ్రీ పాల్గొని పలువురు యూట్యూబర్స్ కు అవార్డులు అందించారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.